నీలగిరి నిత్యపద్యం
ఆటవెలది
చిరునగవును నూపి చిన్న పలకరింపు
మంచి మనసుతోడ మాటయొకటి
సాటిమనిషి తోడ సానుకూలముగున్న
కలుగవంట మనకు కలతలెపుడు
మీ
విజయ ప్రసాద్ నలుమాసు
తెలుగు బోధకులు,కవి
---------------------

# నీలగిరి ఎక్స్‌ప్రెస్
RNI - TELTEL/2023/87644
తెలుగు దిన పత్రిక

సంచిక : 179 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | బుధవారం | 8-10-2025 పేజీలు -8 | వెల: రూ. 5.00



**విలేకరులు కావలెను**
తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్):
& చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా
WHATS APP నంబర్:-
9705770909 సంప్రదించండి.





## హిమాచల్‌లో ఘోర ప్రమాదం

- టూరిస్టు బస్సుపై విరిగిపడిన కొండచరియలు
- 18 మంది మృతి శ్రీ కొనసాగుతున్న సహాయక చర్యలు

**సిమ్లా అక్టోబర్ 7 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ ) :** హిమాచల్ ప్రదేశ్‌లోని బిలాస్‌పుర్ జిల్లాలో ఘోర ప్రమాదం జరిగింది. ఒక టూరిస్టు బస్సుపై కొండచరియలు విరిగిపడటంతో 18 మంది ప్రాణాలు కోల్పోయారు. ప్రమాద సమయంలో బస్సులో 30 నుంచి 35మంది ఉన్నట్టు సమాచారం. వారిలో ముగ్గుర్ని రక్షించారు. శిథిలాల కింద చిక్కుకుపోయిన వారిని రెస్క్యూ సిబ్బంది రక్షించే ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. హర్యానాలోని ర్హతక్ నుంచి హిమాచల్‌ప్రదేశ్‌లోని ఘుమర్విన్‌కు ఈ ప్రయివేటు టూరిస్టు బస్సు బయలుదేరింది. ఝుండూతా అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని బలూఘాట్ ప్రాంతానికి మంగళవారం రాత్రి చేరుకోగానే కొండచరియలు విరిగి బస్సుపై పడ్డాయి. రెస్క్యూ ఆపరేషన్ చేపట్టిన బృందాలు శిథిలాల్లో చిక్కుకున్న పలువురిని -మిగతా 2 లో

# కాంగ్రెస్‌లో 'దుమారం'!



## పొన్నం 'నోటి దురుసు'.. సహచర మంత్రి లక్ష్మణ్‌పై అనుచిత వ్యాఖ్యలు



- బహిరంగ క్షమాపణకు దళిత సంఘాలు డిమాండ్
- 'అడ్లూరి'ని నేనేం అనలేదు.. ఇదంతా బీఆర్ఎస్ కుట్రేనన్న ప్రభాకర్
- ఆత్మగౌరవాన్ని దెబ్బతీశారు.. అధిష్టానానికి ఫిర్యాదు చేస్తా: అడ్లూరి
- పార్టీలో ప్రకంపనలు.. సర్దుబాటుకు అధిష్టానం యత్నం

**హైదరాబాద్ అక్టోబర్ 7 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ )** సహచర మంత్రిపై నోరు జారిన రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, కాంగ్రెస్ ప్రభుత్వానికి కొత్త తలనొప్పి తెచ్చి పెట్టారు. సమావేశానికి సమయానికి రాలేదన్న అసహనంతో దళిత మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌ను ఉద్దేశించి 'ఆ దున్నపోతుగానికేం తెలుసు' అంటూ బాడీ షేమింగ్‌పై చేసిన వ్యాఖ్యల వీడియో పుటేజీ రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర దుమారం రేపుతోంది. ఈ వ్యాఖ్యలు మైక్‌లో రికార్డయి బయటకు రావడంతో వివాదం ఒక్కసారిగా భగ్గుమంది. ఇది కేవలం ఇద్దరు మంత్రుల మధ్య విభేదాలకు దారితీసినా.. 'మాదిగల ఆత్మగౌరవం' చుట్టూ తిరుగుతూ కులం రంగు పులుముకుంది. మంత్రి లక్ష్మణ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేయడం, దళిత సంఘాలు క్షమాపణకు అల్టిమేటం జారీ చేయడంతో ఈ ఎపిసోడ్ కాంగ్రెస్ ప్రభుత్వంలో అంతర్గత సంక్షోభానికి దారితీసింది. పొరపాటును అంగీకరించకుండా 'ఇది బీఆర్ఎస్ కుట్ర' అంటూ పొన్నం చెప్పడాన్ని మంత్రి అడ్లూరి -మిగతా 2 లో

## జాఫర్ ఎక్స్‌ప్రెస్‌పై మరోసారి దాడి

- పలువురు పాక్ సైనికులు మృతి



**న్యూఢిల్లీ**
పాకిస్థాన్ లో బలూచిస్థాన్ లిబరేషన్ ఆర్మీ మరోసారి రెచ్చిపోయింది. జాఫర్ ఎక్స్‌ప్రెస్ ను లక్ష్యంగా చేసుకొని భీకర దాడికి పాల్పడింది. సింధ్-బలూచిస్థాన్ సరిహద్దుకు సమీపంలో గల సుల్తాన్‌కోట్ ప్రాంతంలో రైల్వే ట్రాక్‌పై ఐఈడీ బాంబులు అమర్చి పేల్చింది . అదే సమయంలో క్వెట్టా వెళ్తున్న జాఫర్ ఎక్స్‌ప్రెస్ రైలు ప్రమాదానికి గురైంది. ఆరు బోగీలు పట్టాలు తప్పాయి.ఈ ఘటనకు పాక్‌లోని వేర్పాటువాద బలోచ్ మిలిటెంట్ల బృందం బలూచిస్థాన్ లిబరేషన్ ఆర్మీ బాధ్యత వహించింది. ప్రమాద సమయంలో పాక్ ఆర్మీ సిబ్బంది రైలులో ప్రయాణిస్తున్నట్లు ఓ ప్రకటనలో తెలిపింది. పేలుడు దాటికి అనేక మంది సైనికులు -మిగతా 2 లో



## 9కి చేర్పులు, తొలగింపుల వివరాలివ్వండి

- బీహార్‌లో సర్‌పై సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు

**న్యూఢిల్లీ**
తుది ఓటర్ల జాబితాలో చేర్చిన, తొలగించిన పేర్ల గురించి పారదర్శకంగా ఉండాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఈ నెల 9 నాటికి పూర్తి వివరాలను ఇవ్వాలని పేర్కొంది. బీహార్‌లోని ఎస్ఐఆర్‌పై పిటిషన్లను న్యాయమూర్తులు జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోరుమల్య బాగ్చిలతో కూడిన ధర్మాసనం మంగళవారం విచారించింది. తుది జాబితాలో చేర్చిన పేర్లు ముసాయిదా జాబితా నుండి తొలగించినవా? కాదా? అనే దానిపై గందరగోళం ఉందని పేర్కొంది. వారి అప్పీల్ హక్కుకు సహాయం చేయడానికి ఇసి వ్యక్తిగతంగా ఓటర్లను మినహాయించిందా? అని ప్రశ్నించింది. మినహాయింపుల గురించి ఇంకా ఫిర్యాదులు లేవని ఇసి తెలిపింది. "పారదర్శకత, సమాచారం ప్రజాస్వామ్యానికి ముఖ్య లక్షణాలు" అని ఎన్నికల సంఘానికి సుప్రీంకోర్టు గుర్తు చేసింది. ఎస్ఐఆర్ తరువాత బీహార్ తుది జాబితాలో చేర్చబడిన ఓటర్ల వ్యక్తిగత వివరాల గురించి ఇసిని ప్రశ్నించింది. "తుది జాబితాలో చేర్చిన పేర్ల గురించి గందరగోళం -మిగతా 2 లో

# బీసీ రిజర్వేషన్లపై నేడు హైకోర్టులో విచారణ

- మంత్రులు అధికారులతో సీఎం రేవంత్ సమీక్ష
- అభిషేక్ సింఘ్వీతో తాజాగా చర్చ

**హైదరాబాద్, అక్టోబర్ 7 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ ) :** బీసీ రిజర్వేషన్ల అంశాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. సామాజిక న్యాయం దిశగా చారిత్రాత్మక నిర్ణయంగా భావిస్తున్న ఈ వ్యవహారంలో ఏ మాత్రం నిర్లక్ష్యం జరగకుండా ఉండేందుకు సీఎం రేవంత్ రెడ్డి వ్యక్తిగతంగా పర్యవేక్షి స్తున్నారు. బుధవారం హైకోర్టులో కేసు విచారణకు రానున్న సందర్భంగా మంత్రులు, న్యాయనిపుణులుతో చర్చించారు. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం హైదరాబాద్‌లోని సీఎం క్యాంప్ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్, పీసీసీ -మిగతా 2 లో




## పత్తి రైతులకు అండగా ఉంటాం

- సిసిఐకి మాత్రమే పంటలను అమ్ముకోవాలి
- కేంద్రమంత్రి గిరిరాజ్‌తో కిషన్ రెడ్డి చర్చలు



**న్యూఢిల్లీఅక్టోబర్ 7 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ )** పత్తి రైతులకు కేంద్ర ప్రభుత్వం అండగా ఉంటుందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి భరోసా కల్పించారు. అన్నదాతలు తక్కువ ధరకు పత్తిని బయట అమ్మవద్దని.. ఆలస్యమైన సీసీఐ పత్తిని కొనుగోలు చేస్తోందని స్పష్టం చేశారు. పత్తి కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాకి పంటని అమ్మాలని సూచించారు. 12 శాతం కంటే తక్కువ తేమ ఉన్న కాటన్ కార్పొరేషన్ కొనుగోలు చేస్తోందని స్పష్టం చేశారు. పంటని అమ్మడానికి -మిగతా 2 లో

## ఢిల్లీలో భారీ వర్షం..



- 15 విమానాల దారి మళ్లింపు

**న్యూఢిల్లీ**
ఢిల్లీలో భారీ వర్షం ప్రభావం విమాన సర్వీస్ లపై పడింది. మంగళవారం సాయంత్రం నుంచి వాన జోరుగా పడడంతో 15 విమానాలను దారి మళ్లించారు విమానాశ్రయం అధికారులు. వాతావరణం ప్రతికూలంగా ఉన్నందున ఢిల్లీకి సమీపంలోని సురక్షిత ప్రాంతాలకు వీటిని మళ్లించినట్టు వారు చెప్పారు. ఎనిమిది ఫ్లైట్స్‌ను జైపూర్‌కు, ఐదింటిని లక్నోకు, మరో రెండింటిని ఛండీగఢ్‌కు మళ్లించినట్టు అధికారులు వెల్లడించారు.'ఢిల్లీలో నెలకొన్న ప్రతికూల వాతావరణం ప్రభావం విమాన సర్వీస్‌లపై తీవ్రంగా పడింది. దాదాపు 15 విమానాలను దారి మళ్లించాం. ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బంది -మిగతా 2 లో

## స్థానిక ఎన్నికల్లో పోటీకి మల్లన్న సిద్ధం



- పార్టీకి గుర్తు కేటయించాలని హైకోర్టులో పిటిషన్
- తగు చర్యలు తీసుకోవాలని ఈసీని ఆదేశించిన హైకోర్టు

**హైదరాబాద్,**
తెలంగాణ రాజ్యాధికార పార్టీ స్థానిక ఎన్నికలకు సన్నద్ధం అవుతోంది. బిసిలకు రాజ్యాధికారం లక్ష్యంగా ఏర్పడ్డ ఈ పార్టీ రానున్న స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలని చూస్తోంది. ఈ మేరకు పార్టీ వ్యవస్థాపకులు, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అలియాస్ చింతపండు నవీన్ తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. రాజకీయ పార్టీ గుర్తింపు, పార్టీ గుర్తుపై హైకోర్టులో మల్లన్న పిటిషన్ దాఖలు చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు వీలు కల్పించాలని పిటిషనర్ నవీన్ కోరారు. ఈ పిటిషన్‌పై మంగళవారం హైకోర్టులో విచారణ జరిగింది. పిటిషనర్ అభ్యర్థనను పరిశీలించి చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎన్నికల సంఘానికి హైకోర్టు ధర్మాసనం ఆదేశాలు జారీ చేసింది.
కాగా.. తెలంగాణ రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్లు, రాజ్యాధికారం లక్ష్యంగా ఇటీవల తెలంగాణ రాజ్యాధికార పార్టీని తీన్మార్ మల్లన్న స్థాపించిన విషయం తెలిసిందే. సెప్టెంబర్ 17న తాజ్ కృష్ణ హోటల్‌లో పార్టీని స్థాపించారు. తెలంగాణ రాజ్యాధికార పార్టీ జెండాను ఎరుపు, -మిగతా 2 లో

## నగరంలో బస్ ఛార్జీలపెంపు దారుణం

- 9న ఛలో బస్ భవన్‌కు బిఆర్ఎస్ పిలుపు

**హైదరాబాద్,**
ఆర్టీసీ చార్జీల పెంపునకు నిరసనగా ఈ నెల 9వ తేదీన బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఛలో బస్ భవన్కి పిలుపునిచ్చింది. ఛార్జీల పెంపు పేదలపై భారం పడుతందని మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. ఛలో బస్ భవన్ ధర్నాలో మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావుతో సహా.. -మిగతా 2 లో

# హిమాచల్‌లో ఘోర ప్రమాదం

(మొదటి తరువాయి)

ప్రాణాలతో బయటకు తీశాయి. ఈ ఘటనపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని నరేంద్రమోడీ, హిమాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి సుఖ్విందర్ సింగ్ సుఖు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సహాయక చర్యలు ముమ్మరం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మృతుల కుటుంబాలకు ఒక్కొరికీ రూ 2 లక్షలు, గాయపడిన వారికి రూ.50 వేలు పరిహారాన్ని ప్రధాని ప్రకటించారు. కేంద్ర మంత్రులు అమిత్‌షా, జెపి నడ్డా, కాంగ్రెస్ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే ఈ ప్రమాదంపై విచారం వ్యక్తం చేశారు. ఈ ఘటన బాధాకరం, దురదృష్టకరమని తెలిపారు.

# జాఫర్ ఎక్స్‌ప్రెస్‌పై మరోసారి దాడి

(మొదటి తరువాయి)

మరణించినట్లు పేర్కొంది. పలువురు గాయపడినట్లు వెల్లడించింది. బలూచిస్థాన్‌కు స్వాతంత్ర్యం వచ్చే వరకూ ఇలాంటి దాడులు కొనసాగుతాయని ఈ సందర్భంగా హెచ్చరించింది. మరోవైపు ఘటన సమాచారం అందుకున్న రెస్క్యూ టీమ్ హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టింది. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం సమీపంలోని ఆస్పత్రికి తరలించింది. ప్రస్తుతం అక్కడ సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఈ ఘటనలో ఎంతమంది ప్రాణాలు కోల్పోయారన్నదానిపై మాత్రం స్పష్టత లేదు. జాఫర్ ఎక్స్‌ప్రెస్‌పై దాడి జరగడం ఈ ఏడాది ఇది మూడోసారి కావడం గమనార్హం. ఈ ఏడాది మార్చిలో జాఫర్ ఎక్స్‌ప్రెస్‌ను పాక్‌లోని వేర్పాటువాద బలోచ్ మిలిటెంట్లు హైజాక్ చేశారు. అందులోని వందలాది మందిని బందీలుగా చేసుకున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో వారిని రక్షించేందుకు వెళ్లిన పాక్ సైనికులను హతమార్చారు. అనంతరం పాక్ ఆర్మీ ఆపరేషన్ చేపట్టి బందీలను విడిచిపెట్టింది. ఆ తర్వాత జూన్‌లో మరోసారి ఈ రైలును లక్ష్యంగా చేసుకొని దాడి చేశారు. అంతేకాదు ఈ ప్రాంతంలో పాక్ ఆర్మీని లక్ష్యంగా చేసుకొని బలోచ్ గ్రూప్ వరుస దాడులకు పాల్పడుతోంది.

## పత్తి రైతులకు అండగా ఉంటాం

(మొదటి తరువాయి)

122 పత్తి కొనుగోలు కేంద్రాలు ఉంటాయని.. ఎవరైనా
రైతులను మోసం చేస్తే వెంటనే అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం తరపున రైతులకు అండగా ఉంటామని మాటిచ్చారు. పత్తిని చివరి వరకు కేంద్ర ప్రభుత్వం కొనుగోలు చేస్తోందని కిషన్‌రెడ్డి తెలిపారు. మంగళవారం కేంద్ర జౌళి శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్‌తో కిషన్‌రెడ్డి ఢిల్లీలో సమావేశం అయ్యారు. తెలంగాణ పత్తి రైతుల సమస్యలపై గిరిరాజ్ సింగ్‌తో కిషన్‌రెడ్డి చర్చించారు. తెలంగాణ పత్తి రైతుల సమస్యలపై గిరిరాజ్ సింగ్‌కి విజ్ఞాపనలు అందజేశారు కిషన్‌రెడ్డి. పత్తిలో తేమ 12 శాతం మించకుండా ఉండాలని సూచించారు. కాటన్ కొనుగోలు విషయంలో తెలంగాణ ప్రభుత్వానికి కేంద్ర ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. 122 సెంటర్లలో పత్తి కొనుగోలు జరుగుతోందని తెలిపారు. తేమశాతం కొలిచే మిషన్లు కొనుగోలు కేంద్రాల్లో ఉంటాయని వెల్లడించారు. రైతులకు అండగా 122 సెంటర్లలోని కమిటీలు ఉండాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. కేంద్ర జోలి శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్‌ని తాను కలిశానని తెలిపారు. తెలంగాణ పత్తి రైతుల సమస్యలను వివరించానని పేర్కొన్నారు. తెలంగాణలో కేవలం పత్తి కొనుగోలు ద్వారా కేంద్ర ప్రభుత్వం రూ.65 వేల కోట్లు ఖర్చు చేస్తోందని వెల్లడించారు. తెలంగాణలో మౌలిక వసతులు పెంచాలని సూచించారు. కాటన్ ఉత్పత్తి కేంద్రాలు పెంచాలని దిశానిర్దేశర చేశారు. మహారాష్ట్ర కోలలో హై డెన్సిటీ ఎ÷-లాంటేషన్ చేస్తున్నారని, తెలంగాణలో ఎందుకు చేయడం లేదని కేంద్ర జౌళి శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్ తనను అడుగుతున్నారని చెప్పుకొచ్చారు. రైతుల్లో అవగాహన తీసుకురావాలని సూచించారు. పత్తిలో తేమశాతం తగ్గించేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నం చేయాలని సూచించారు కిషన్‌రెడ్డి.
రైతుల్లో రాష్ట్ర ప్రభుత్వం అవగాహన తీసుకురావాలని కోరారు. అందరూ ఒకేసారి పత్తిని జిన్నింగ్ మిల్స్‌కి తీసుకురావడంతో పంట కొనుగోలు చేయడంలో ఇబ్బంది ఏర్పడుతోందని వివరించారు. ఆన్‌లైన్‌లో ముందస్తుగానే పత్తిని ఏరోజు తీసుకువస్తారనేది రిజిస్టర్ చేసుకుంటే సమస్య ఉండదని చెప్పుకొచ్చారు. సీసీఐ నుంచి నేరుగా రైతుల ఖాతాకు డబ్బు వెళ్తుందని స్పష్టం చేశారు. ఇతర దేశాల్లో కాటన్ రేటు తక్కువగా ఉందని తెలిపారు. ఉపాధి హామీ నిధులని పత్తిలో తేమ తగ్గించేందుకు రైతుల కోసం తెలంగాణ ప్రభుత్వం ఖర్చు చేయాలని సూచించారు. మహారాష్ట్ర అకోలాలో హై డెన్సిటీ ఎ÷-లాంటేషన్ ద్వారా ఉత్పత్తి పెరిగి రైతుల ఆదాయం పెరుగుతోందని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం కూడా ఆ దిశగా చర్యలు తీసుకోవాలని కిషన్‌రెడ్డి సూచించారు.

# ఢిల్లీలో భారీ వర్షం..

(మొదటి తరువాయి)

ఎదురవ్వడకుండా మా సిబ్బంది నిరంతరం చూసుకుంటున్నారు' అని ఎక్స్ వేదికగా ఢిల్లీ విమానాశ్రయం అధికారులు పోస్ట్ పెట్టారు. మంగళవారం సాయంత్రం ఢిల్లీలో కుండపోతగా వర్షం పడింది. దాంతో, అప్రమత్తమైన విమానాశ్రయం అధికారులు విమానాలను దారి మళ్లించారు. ఢిల్లీలోని మరిన్ని ప్రాంతాల్లో వర్షం కొనసాగుతుందని వాతావరణ శాఖ తెలిపింది. మధ్య భాగం, పశ్చిమ ప్రాంతంలో పాటు ఉత్తర ఢిల్లీ, వాయువ్య ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వాన పడే అవకాశముందని ప్రాంతీయ వాతావరణ కేంద్రం చెప్పింది. అంతేకాదు పశ్చిమ, దక్షిణ ఢిల్లీకి ఎల్లో ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. లక్నోలోని వాతావరణ శాఖ సైతం నోయిడా, ఘజియాబాద్‌లకు ఎల్లో అలెర్ట్ ఇచ్చింది.

## స్థానిక ఎన్నికల్లో పోటీకి మల్లన్న సిద్ధం

(మొదటి తరువాయి)

ఆకుపచ్చ రంగుల్లో రూపొందించారు. జెండా మధ్యలో పిడికిలి బిగించిన చేయితో పాటు కార్మిక చక్రం, వరి కంకులు ఉన్నాయి. జెండాపై భాగంలో ఆత్మగౌరవం, అధికారం, వాటా నినాదాలను రాశారు. పిడికిలి కింది భాగంలో పార్టీ పేరును ముద్రించారు. అయితే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు అవకాశం కల్పించాలని న్యాయస్థానాన్ని మల్లన్న కోరడం.. చట్టపరంగా చర్యలు తీసుకోవాలని హైకోర్టు ఆదేశించిన నేపథ్యంలో... మల్లన్నకుఎన్నికల సంఘం ఎలాంటి గుర్తును కేటాయిస్తుందో అన్న ఆసక్తి పెరిగింది.

# కాంగ్రెస్‌లో 'దుమారం'!

(మొదటి తరువాయి)


ఆయన అనుచరులు జీర్ణించుకోలేకపోతున్నారు. ఇది పొన్నం అహంకార వైఖరికి నిదర్శనమనే అభిప్రాయం ఆ పార్టీలో వినిపిస్తోంది.

**అసలేం జరిగింది?**

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా రహ్మత్ నగర్‌లో మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి, అడ్లూరి లక్ష్మణ్ మీడియా సమావేశం నిర్వహించాల్సి ఉంది. అయితే, మంత్రి లక్ష్మణ్ కాస్త ఆలస్యంగా రావడంతో పొన్నం ప్రభాకర్ అసహనానికి గురయ్యారు. పక్కనే ఉన్న మంత్రి వివేక్ చెవిలో 'మనకు టైం అంటే తెలుసు.. జీవితమంటే తెలుసు.. వారికేం తెలుసు.. ఆ.. దున్నపోతు గానికి' అని గుసగుసలాడారు. మైకులు ఆన్‌లో ఉండటంతో ఈ వ్యాఖ్యలు స్పష్టంగా రికార్డయ్యాయి. ఈ వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో వివాదం మొదలైంది. సహచర మంత్రిని, అందులోనూ ఒక దళిత మంత్రిని ఉద్దేశించి బాడీ షేమింగ్ చేయడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తాయి. ఇది కేవలం లక్ష్మణ్‌కు జరిగిన అవమానం కాదని, మాదిగల ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడమేనని ఎమ్మార్పీఎస్ వంటి సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి.

**క్షమాపణకు ససేమిరా.. బీఆర్ఎస్ కుట్రంటూ ఎదురుదాడి**

వివాదం ముదురుతున్నా మంత్రి పొన్నం ప్రభాకర్ తీరులో మార్పు రాలేదు. తప్పును అంగీకరించి క్షమాపణ కోరాల్సింది పోయి, ఎదురుదాడికి దిగారు. తన వ్యాఖ్యలను వక్రీకరించారని, ఇదంతా బీఆర్ఎస్ సోషల్ మీడియా చేస్తున్న కుట్ర అని ఆరోపించారు. 'అడ్లూరి వ్యాఖ్యలపై నేను స్పందించను. పీసీసీ అధ్యక్షులు నాతో మాట్లాడారు.. అదే ఫైనల్' అని చెప్పడం ద్వారా ఈ వివాదాన్ని ఇంతటితో ముగించాలని చూశారు. అయితే, ఆయన వైఖరి.. సమస్యను మరింత జటిలం చేసింది. కనీసం పశ్చాత్తాపం కూడా వ్యక్తం చేయకపోవడం పొన్నం



అహంకారానికి నిదర్శనమని, ఆయనలోని దురుసుతనాన్ని ఇది బయటపెట్టిందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు. ఇదే సమయంలో ఈ వివాదాన్ని త్వరగా పరిష్కరించకపోతే, అది ప్రభుత్వ ప్రతిష్టకు తీవ్ర భంగం కలిగించడంతో పాటు పార్టీలోని సామాజిక తరగతుల మధ్య అగాధాన్ని పెంచే ప్రమాదం ఉందని పార్టీ సీనియర్ నేతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**అధిష్ఠానానికి ఫిర్యాదు చేస్తా : అడ్లూరి**

పొన్నం వ్యాఖ్యలపై మంత్రి అడ్లూరి లక్ష్మణ్ తీవ్రంగా స్పందించారు. 'జరిగిన పొరపాటును ఒప్పుకొని క్షమాపణ చెబితే పొన్నంకు గౌరవం ఉంటుంది. మాదిగలు అంటే అంత చిన్న చూపా?' అని ఆయన ఆవేదన, ఆగ్రహం వ్యక్తం చేశారు. పొన్నం తన తప్పు తెలుసుకుంటాడని ఆశించానని, కానీ ఆయన మారకపోతే జరిగే పరిణామాలకు బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. అంతేకాకుండా, 'నేను మాదిగను కాబట్టే నాకు మంత్రి పదవి వచ్చింది. నేను మంత్రి కావడం, మా సామాజిక తరగతిలో పుట్టడం తప్పా?' అని ప్రశ్నించారు. ఈ విషయాన్ని కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే దృష్టికి తీసుకెళ్తానని అన్నారు. మంత్రి వివేక్ తన పక్కన కూర్చోవడానికి కూడా ఇష్టపడటం లేదని, ఇది ఎంతవరకు సమంజసమని ఆయన వాపోయారు.

**సర్దుబాటుకు అధిష్టానం యత్నం**

ఈ వివాదం కాంగ్రెస్ పార్టీలో అంతర్గత విబేధాలను మరోసారి బయటపెట్టింది. సొంత పార్టీ నేతలే పొన్నం వైఖరిని తప్పుబడుతున్నారు. జగిత్యాల, ధర్మపురి నియోజకవర్గాల్లో కాంగ్రెస్ శ్రేణులు సైతం లక్ష్మణ్‌కు మద్దతుగా నిలిచి, పొన్నం తీరును తప్పుబట్టాయి. బుగ్గారం మండల కాంగ్రెస్ నాయకులు పొన్నం వ్యాఖ్యలను ఖండించారు. మరో మంత్రి శ్రీధర్‌బాబు కూడా పొన్నం వ్యాఖ్యలను తీవ్రంగా తప్పుబట్టారు. దాంతో రంగంలోకి దిగిన టీపీసీసీ అధ్యక్షులు మహేశ్‌కుమార్ గౌడ్ ఇద్దరు మంత్రులతో మాట్లాడి వివాదాన్ని సద్దుమణిచే ప్రయత్నం చేశారు. మరోవైపు 24 గంటల్లో పొన్నం క్షమాపణ చెప్పాలని, లేదంటే ఆయన కార్యాలయాన్ని ముట్టడిస్తామని ఎమ్మార్పీఎస్ హెచ్చరించింది. పొన్నంను కేబినెట్ నుంచి బర్తరఫ్ చేయాలన్న డిమాండ్లు కూడా ఊపందుకున్నాయి. మొత్తం మీద, పొన్నం ప్రభాకర్ నోటి దురుసు ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వానికి తలనొప్పిగా మారింది. ఈ వివాదాన్ని అధిష్టానం ఎలా పరిష్కరిస్తుందో వేచి చూడాలి.

# 9కి చేర్పులు, తొలగింపుల వివరాలివ్వండి

(మొదటి తరువాయి)

ఉంది. చేర్చిన వ్యక్తుల గుర్తింపు ఏమిటి? ఇది డ్రాఫ్ట్ రోల్‌లో తొలగించిన 65 లక్షల మంది ఓటర్ల నుండి తీసుకోబడిన పేర్లా? కొత్త పేర్లా? లేక యాడ్ అయిన పేర్లా? " అని జస్టిస్ జోరుమల్య బాగ్చి ప్రశ్నించారు. తుది జాబితా రాష్ట్రంలో 7.42 కోట్ల మంది అర్హులైన ఓటర్లు ఉన్నారని చూపిస్తుంది. ఎస్ఐఆర్ తర్వాత ప్రచురించిన ముసాయిదా ఓటర్ల జాబితాలోని 7.24 కోట్ల ఓటర్ల కంటే ఇది ఎక్కువ. బీహార్‌లో ఎస్ఐఆర్ ప్రక్రియ నోటిఫికేషన్ తేదీ జూన్ 24న 65 లక్షల పేర్లను తొలగించారు. తుది జాబితా నుండి తొలగించిన 3.66 లక్షల మందికి సంబంధించి అప్పీళ్లు దాఖలు చేయడానికి వీలుగా తగిన అధికారిక తొలగింపు ఉత్తర్వులతో వ్యక్తిగతంగా సమాచారం ఇచ్చారా? అని ఇసిని కోర్టు ప్రశ్నించింది. "వారికి అప్పీల్ చేసుకునే హక్కు ఉంది" అని జస్టిస్ సూర్యకాంత్ తెలిపారు. ఓటర్ల జాబితా నుంచి మినహాయించిన 3.66 లక్షల మంది ఓటర్ల పేర్లు, వివరాలతో కూడిన ప్రత్యేక జాబితాను ప్రచురించారా? వాటిని అట్టడుగు స్థాయిలో సులభంగా అందుబాటులో ఉంచారా? అని ధర్మాసనం ప్రశ్నించింది. జిల్లా ఎన్నికల కార్యాలయాల నోటీసు బోర్డులపై తొలగించిన ఓటర్ల పేర్లు, వివరాలను ప్రదర్శించాలని కోరుతూ 1960 ఓటర్ల నమోదు నియమాల్లోని నిబంధన 21ఎని జస్టిస్ బాగ్చి ప్రస్తావించారు.
డేటాను ఇప్పటికీ క్షేత్రస్థాయి అధికారుల నుండి సేకరించి ప్రాసెస్ చేస్తున్నట్లు ఈసి తరపున సీనియర్ న్యాయవాది రాకేష్ ద్వివేది తెలిపారు. పిటిషనర్ల తరపు సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ లిఖితపూర్వక వాదనలలో ఇప్పటికే లేవనెత్తిన అంశాలను పరిష్కరించాలని ఇసిని ధర్మాసనం ఆదేశించింది.

**వయోజనుల్లో 10 శాతం మందికి ఓటు హక్కు నిరాకరణ**

2025 సెప్టెంబర్ నాటికి బీహార్‌లో వయోజన జనాభా అధికారిక అంచనా 8.22 కోట్లు అయినప్పటికీ, తుది జాబితాలో ఓటర్ల సంఖ్య 7.42 కోట్లు మాత్రమే అని ప్రశాంత్‌భూషణ్ పేర్కొన్నారు. "ఈ విధంగా, 80 లక్షలు, అంటే, బీహార్‌లోని మొత్తం వయోజన జనాభాలో దాదాపు 10 శాతం మంది ఓటు హక్కు కోల్పోయారు. వయోజన జనాభా - ఓటర్ల నిష్పత్తిలో ఇంత తగ్గుదల దేశానికి, బీహార్‌కు రికార్డు" అని తెలిపారు. దేశంలోని ఏ రాష్ట్రంలోనూ ఇంతకు ముందు 10 శాతం మంది ఓటర్లు జాబితా నుండి తొలగించబడలేదని ఆయన పేర్కొన్నారు. బీహార్ ఓటర్ల జాబితా నుండి లక్షలాది మంది మహిళలు 'తప్పిపోయారని' అన్నారు. "ఎస్ఐఆర్ తరువాత బీహార్‌లో లింగ నిష్పత్తి సెప్టెంబర్ 2025 నాటికి 934గా ఉండగా, తుది ఓటర్ల జాబితాలో లింగ నిష్పత్తి 892కి పడిపోయింది.
దీని అర్థం 17 లక్షల మంది మహిళలు తప్పిపోయారు. ఎస్ఐఆర్ ఒక దశాబ్ద కాలంగా ఓటర్ల జాబితాలో లింగ నిష్పత్తిలో సాధించిన ప్రగతిని తుడిచిపెట్టింది" అని పేర్కొన్నారు. "పేరు గుర్తింపు సాఫ్ట్‌వేర్ ఆధారంగా చేసిన మా విశ్లేషణ ప్రకారం, ముసాయిదా జాబితా నుండి మినహాయించిన 65 లక్షల మంది ఓటర్లలో ముస్లింలు 25 శాతం, తుది జాబితా నుండి తొలగించబడిన 3.66 లక్షల మంది ఓటర్లలో 34 శాతం మంది ఉన్నారని తేలింది. ఈ అసమాన మినహాయింపు దాదాపు ఆరు లక్షల మంది ముస్లిం ఓటర్ల తగ్గింపుకు దారితీసింది" అని ప్రశాంత్ భూషణ్ పేర్కొన్నారు. తుది జాబితాలోని కనీసం 5.17 లక్షల పేర్లు నకిలీలుగా కనిపిస్తున్నాయని ప్రశాంత్ భూషణ్ పరిశీలనపై స్పందించాలని ఇసిని ధర్మాసనం కోరింది. అనంతరం తదుపరి విచారణను గురువారానికి వాయిదా వేసి

# బీసీ రిజర్వేషన్లపై నేడు హైకోర్టులో విచారణ

(మొదటి తరువాయి)

అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి తదితరులు పాల్గొన్నారు. బీసీ రిజర్వేషన్ల అంశం సామాజిక సమతుల్యతకు సంబంధించిన కీలకమైన అంశమని ప్రభుత్వం భావిస్తోంది. కేసు పురోగతిని గంట గంటకు పర్యవేక్షిస్తూ, న్యాయపరంగా ఏ మార్పులు వచ్చినా తక్షణమే వ్యూహాన్ని సవరించుకునేలా ప్రత్యేక టీమ్‌ను సీఎం రేవంత్ ఏర్పాటు చేశారు. న్యాయ పోరాటంతో పాటు రాజకీయ, సామాజిక వర్గాల మద్దతు కూడగట్టే ప్రయత్నాలు కూడా సమాంతరంగా కొనసాగుతున్నాయి. సుప్రీంకోర్టు నుంచి హైకోర్టు దాకా ప్రతి దశలోనూ బీసీల హక్కుల పరిరక్షణ కోసం ప్రభుత్వం తన పూర్తి శక్తిని వినియోగిస్తోంది. సుప్రీంకోర్టులో జరిగిన విచారణ సందర్భంగా తెలంగాణ తరఫున ప్రముఖ న్యాయ నిపుణులు అభిషేక్ సింఘ్వి, సిద్ధార్థ దవే లు హాజరై వాదనలు వినిపించారు. ఈ విచారణకు ముందే సీఎం రేవంత్ రెడ్డి స్పష్టమైన దిశానిర్దేశాలు ఇవ్వడంతో, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి లతో కూడిన బృందం ఢిల్లీ వెళ్లి న్యాయ నిపుణులతో విస్తృతంగా చర్చించింది. కేసు ప్రాధాన్యత దృష్ట్యా భట్టి విక్రమార్క, మంత్రుల బృందం స్వయంగా సుప్రీంకోర్టు విచారణను ప్రత్యక్షంగా పర్యవేక్షించింది. ఈ క్రమంలో మంగళవారం సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా సీనియర్ అడ్వకేట్ అభిషేక్ సింఘ్వి తో ఫోన్ లో మాట్లాడారు. బుధవారం హైకోర్టులో జరగనున్న బీసీ రిజర్వేషన్ల కేసు విచారణకు స్వయంగా హాజరై వాదనలు వినిపించాలని ఆయన కోరారు. ఈ విషయమై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఢిల్లీలో సింఘ్విని కలసి ఇదే విషయమై విజ్ఞప్తి చేశారు. బీసీ రిజర్వేషన్ల అంశం రాష్ట్ర ప్రభుత్వానికి అత్యంత సున్నితమైనదని, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా న్యాయస్థానంలో బలమైన వాదనలు వినిపించాలని వారు కోరారు. హైకోర్టులో జరగనున్న విచారణకు ముందు, కేసు పురోగతిపై సమగ్ర సమీక్ష జరపాలని సీఎం నిర్ణయించారు.

## నగరంలో బస్ ఛార్జీలపెంపు దారుణం

(మొదటి తరువాయి)

బీఆర్ఎస్ నేతలు పాల్గొంటారని తెలిపారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో మీడియాతో తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడారు. నందినగర్ నుంచి కేటీఆర్.. మెహిదీపట్నం నుంచి హరీశ్‌రావు బస్సులో ప్రయాణం చేసి బస్ భవన్‌కి చేరుకుంటారని చెప్పుకొచ్చారు తలసాని శ్రీనివాస్ యాదవ్. పెంచిన బస్సు చార్జీలను రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. మహిళలకు ఉచిత ప్రయాణం అంటూనే.. వాళ్ల కుటుంబ సభ్యులపై భారం వేయడం అన్యాయమని చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉపాధి కోల్పోయిన వారి సంఖ్యనే ఎక్కువని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రియల్ ఎస్టేట్ పడిపోయిందని ఆరోపించారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తామని కాంగ్రెస్ మేనిఫెస్టోలో కూడా చెప్పిందని గుర్తుచేశారు తలసాని శ్రీనివాస్ యాదవ్. గౌలిగూడ బస్ డిపోను రూ.400కోట్లకు ప్రైవేట్ వాళ్లకి ఇచ్చారని ఆరోపించారు. మియాపూర్, ఉప్పల్‌తో సహా.. వివిధ డిపోలను ప్రైవేటీకరణ చేయబోతున్నారని విమర్శించారు.

## 2025 అక్టోబర్ 8, బుధవారం తెలుగు పంచాంగం




మాసం - పక్షం
ఆశ్వయుజ మాసం
కృష్ణ పక్షం
తిథి
ప్రథమా: అక్టోబర్ 7 ఉదయం 8:27 అక్టోబర్ 8 ఉదయం 5:39 వరకు
ద్వితీయ: అక్టోబర్ 8 ఉదయం 5:39 అక్టోబర్ 9 ఉదయం 3:20 వరకు
నక్షత్రం
రేవతి: అక్టోబర్ 7 ఉదయం 5:19 అక్టోబర్ 8 ఉదయం 4:34 వరకు
అశ్విని: అక్టోబర్ 8 ఉదయం 4:34 అక్టోబర్ 9 ఉదయం 4:20 వరకు
సూర్యోదయం / సూర్యాస్తమానం
సూర్యోదయం: ఉదయం 6:10
సూర్యాస్తమానం: సాయంత్రం 5:57
శుభ సమయాలు
బ్రహ్మ ముహూర్తం: ఉదయం 4:35 - 5:22
అభిజిత్ ముహూర్తం: మధ్యాహ్నం 11:41 - 12:27
అమృతకాలం: మధ్యాహ్నం 2:01 - 3:32
అశుభ సమయాలు
రాహుకాలం: మధ్యాహ్నం 12:04 - 1:32
యమగండం: ఉదయం 7:39 - 9:07
దుర్ముహూర్తం: ఉదయం 11:18 - 12:06, రాత్రి 10:47 - 11:35
వర్జ్యం: ఉదయం 10:04 - 11:35

# ఆశ్రమ పాఠశాలలో ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదం





**కద్తాల్ , అక్టోబర్ 7 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ ) :**
కడ్తాల్ మండలంలోని మైసిగండి గ్రామంలో ఉన్న ప్రభుత్వ గిరిజన బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సంబంధించిన స్కాలర్షిప్ మాన్యువల్ ప్రమాదవశాత్తు అగ్నికి ఆహుతైనట్లు కడ్తాల్ సీఐ గంగాధర్ తెలిపారు. ఆయన కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఆశ్రమ పాఠశాలలోని ఓ భవనం గదిలో భద్రపరిచిన రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాలకు సంబంధించిన స్కాలర్షిప్ మాన్యువల్ ఆన్లైన్ స్పైరల్ బాండింగ్ హార్డ్ కాపీస్ 1982 నుంచి 2015 వరకు ఫైల్స్ రికార్డ్స్ ప్రమాదవశాత్తు కాలిపోయాయి. హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఇన్స్పెక్టర్ గంగాధర్ తెలిపారు.

# సిజెఐపై దాడిని ఖండిస్తూ ఆమనగల్ న్యాయవాదుల నిరసన



**ఆమనగల్, అక్టోబర్ 7(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
న్యాయవ్యవస్థ గౌరవాన్ని కాపాడే న్యాయవాదులు ఈరోజు ఆమనగల్ జూనియర్ సివిల్ కోర్టు ఆవరణలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్. గావాయ్ పై న్యాయవాది రాకేష్ కిషోర్ నిన్న కోర్టు ఆవరణలో బూటుతో దాడికి యత్నించిన ఘటనను తీవ్రంగా ఖండిస్తూ, విధులను బహిష్కరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆమనగల్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు అండే కార్ యాదిలాల్ మాట్లాడుతూ, "సిజెఐపై జరిగిన దాడి న్యాయవ్యవస్థ చరిత్రలో చీకటి రోజుగా నిలిచిపోతుంది. న్యాయవాదులుగా మేము ఈ చర్యను తీవ్రంగా ఖండిస్తున్నాం. న్యాయవ్యవస్థ గౌరవాన్ని కాపాడేందుకు బాధ్యుడిపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలి" అని పేర్కొన్నారు. నిరసన కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి దుడ్డు ఆంజనేయులు, ఉపాధ్యక్షులు ఏర్పుల రామకృష్ణ, సంయుక్త కార్యదర్శి విజయ్ కుమార్ గౌడ్, కోశాధికారి కొప్పు కృష్ణ, క్రీడా కార్యదర్శి శేఖర్, గ్రంథాలయ కార్యదర్శి వసుపుల మల్లేష్ తదితరులు పాల్గొన్నారు. అలాగే న్యాయవాదులు జానకి రాములు, మధు గౌడ్, గణేష్ గౌడ్, దేవేందర్, జగన్ గౌడ్, ఆంజనేయులు, శేఖర్, మహేశ్వర్, శ్రీనివాస్, బీక్య నాయక్, శ్రీశైలం, ప్రభు తదితరులు సంఘటితంగా పాల్గొని సంఘీభావం ప్రకటించారు.

# ఎస్సీడిడి మంత్రి అడ్లూరి లక్ష్మణ్ ను సహచర మంత్రి అవమానించడం అహంకారానికి ప్రతీక...

**ఎస్సీడిడి మినిస్టీరియల్ స్టాఫ్ అసోసియేషన్ ఖండన...**

**హైదరాబాద్, అక్టోబర్ 7(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
: తెలంగాణ రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ మంత్రి గౌరవ అడ్లూరి లక్ష్మణ్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన గౌరవ బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వ్యాఖ్యలు ఆక్షేపణీయమని తెలంగాణ షెడ్యూల్డ్ కులాల మినిస్టీరియల్ స్టాఫ్ అసోసియేషన్ అభిప్రాయపడింది. సహచర మంత్రి అన్న ఇంగిత జ్ఞానం కూడా లేకుండా మంత్రి పొన్నం అహంకారపూరిత భాషను వాడటం ఎంతవరకు సమంజసం అని ఎస్సీడిడి స్టాఫ్ అసోసియేషన్ ఆవేదన వ్యక్తం చేసింది. ఈ మేరకు అసోసియేషన్ తరపున రాష్ట్ర అధ్యక్షులు ఉప్పు సత్యనారాయణ మరియు రాష్ట్ర కార్యవర్గం ఒక ప్రకటన విడుదల చేసింది. బాధ్యతాయుతమైన మంత్రి పదవిలో ఉండి ప్రజలకు మార్గదర్శకంగా ఉండాల్సిన సహచర మంత్రిపై బహిరంగంగా విమర్శలు చేయడం తగునా అని ఉప్పు సత్యనారాయణ నిలదీశారు. సౌమ్యుడు, నిబద్ధతగల ప్రజల మనిషి, ఎంత ఎదిగినా ఒదిగి ఉండే షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ మంచితనాన్ని ఆసరాగా చేసుకొని అవమానిస్తే ఊరుకునేది లేదని ఉప్పు సత్యనారాయణ హెచ్చరించారు. ఒకటికి పది సార్లు ఆలోచించుకొని మాట్లాడాలని, తోటి మంత్రులను అవమానిస్తే ప్రజలకు ఎలాంటి సంకేతాలు వెళ్తాయో అర్థం చేసుకొని వ్యవహరించాలని ఉప్పు సత్యనారాయణ హితవు పలికారు. షెడ్యూల్డ్ కులాల శాఖ మంత్రిపై చేసిన వ్యాఖ్యలపై తక్షణమే సంజాయిషీ ఇవ్వాలని మంత్రి పొన్నం ప్రభాకర్ ను అసోసియేషన్ డిమాండ్ చేసింది. సున్నితమైన అంశంపై స్పందించకపోతే తరువాత అనూహ్యమైన పరిణామాలు జరిగే అవకాశం ఉందని అసోసియేషన్ హెచ్చరించింది.

# సుప్రీంకోర్టు సిజెఐ బిఆర్ గవాయిపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం

**న్యాయవాది ఎర్ర కృష్ణ జాంభవ్ .**



**దేవరకొండ,అక్టోబర్ 07 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
దేవరకొండ పట్టణంలో స్థానికంగా ఉన్న కార్యాలయంలో న్యాయవాది కృష్ణ జాంభవ్ సుప్రీంకోర్టు సిజెఐ బిఆర్ గావాయి పై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తూ ప్రకటన విడుదల చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇది కేవలం న్యాయవ్యవస్థపైనే కాదు దేశంపై జరిగిన దాడిగానే పరిగనించాలి. మతం పేరుతో దేశంపై, న్యాయవ్యవస్థపై దాడి జరుగుతున్నదంటే సాధారణ ప్రజల పట్ల వీళ్ళ అకృత్యాలు ఎట్లా ఉంటాయో అర్థం చేసుకోవొచ్చు. దేశంలోనే మత ఉగ్రవాదులు ఉన్నారు,వారు అన్ని రంగాలలో ఉన్నారు. వారు రాజ్యాంగ, దేశ వ్యతిరేఖ కార్యాకలపాలకు పాల్పడుతూ భిన్నత్త్వంలో ఏకత్వం నినాదాన్ని దెబ్బతీసి కల్లోలం చేయాలన్నే వారి లక్ష్యంగా దేశంలో రాజ్యాంగ వ్యతిరేక కార్యకలాపాలు నిరహిస్తున్నా ఉన్న సంస్థను ఉగ్రవాద సంస్థగా పరిగణించాలి, దానిని రద్దు చేయాలి, అల్లరి మూకలని అరెస్ట్ చేయాలి. బేషరతుగా ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ రాజీనామా చేయాలి. దేశానికి ఆర్ ఎస్ ఎస్, బిజేపి ఎంత ప్రమాదమో అర్థం చేసుకోవాలి. రేపు దేశవ్యాప్త నిరసనకు దేశ పౌరులందరు, ప్రజా సంఘాలు, కుల, మత, మహిళా సంఘాలు, ప్రభుత్వ ఉద్యోగులు మరియు న్యాయవాదులు, కోర్టు స్టాఫ్ ప్రతి ఒక్కరు బైకాడ్ చేయాలిన్సిందిగా విజ్ఞప్తి చేశారు.

# సూర్యగిరి ఎల్లమ్మ తల్లి ఆలయ ప్రధాన రహదారికి శాశ్వత పరిష్కారం చూపండి

**- శ్రీరాములు అందెల**

**-ఒక వర్గం ఓట్లతో గెలిచినందుకు హిందువులపై వివక్ష చూపుతున్న సబితా ఇంద్రారెడ్డి - శ్రీరాములు అందెల**

**తుక్కుగూడ,అక్టోబర్ 7(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం తుక్కుగూడ మున్సిపాలిటీ లోని ప్రసిద్ధిగాంచిన సూర్యగిరి ఎల్లమ్మ తల్లి ఆలయానికి వెళ్లే ప్రధాన రహదారి గత నెల రోజులుగా కురుస్తున్నటువంటి భారీ వర్షాలకు రోడ్డు మార్గం పూర్తిగా మునిగిపోవడంతో భక్తులు ఆలయానికి వెళ్లే మార్గంలో అనేక ఇబ్బందులు పడుతున్న విషయాన్ని తెలుసుకొని ఈరోజు రంగారెడ్డి జిల్లా స్థానిక సంస్థల ఎన్నికల కన్వీనర్ మహేశ్వరం నియోజకవర్గం బిజెపి ఇంచార్జ్ అందెల శ్రీరాములు స్థానిక బిజెపి నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులతో కలిసి ప్రధాన రహదారిని సందర్శించారు. ఈ సందర్భంగా భక్తులు పడుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు అనంతరం మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో బల్కంపేట ఎల్లమ్మ తల్లి ఆలయం తర్వాత అత్యంత ప్రసిద్ధిగాంచిన ఆలయంగా సూర్యగిరి ఎల్లమ్మ తల్లి ఆలయం అని పేర్కొన్నారు మరి అలాంటి ఆలయానికి సరైనటువంటి ప్రధాన రహదారి






లేకపోవడం...ఉన్న రహదారి కూడా భారీ వర్షాలకు మునిగిపోవడం వల్ల భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని.. ఎండోమెంట్ గాని ప్రభుత్వం గాని స్థానికంగా ఉన్న ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి గాని హిందువుల సమస్యలు పట్టించుకోరా అని ప్రశ్నించారు. నియోజకవర్గ వ్యాప్తంగా హిందూ ఆలయాల సమస్యలను పట్టించుకోవట్లేదని కేవలం ఒక వర్గం మెప్పుకోసం హిందువులపై వివక్ష చూపుతున్నారని ఆగ్రహించారు. వెంటనే ఆలయానికి వెళ్లే ప్రధాన రహదారిని డబుల్ లైన్ రోడ్డుగా నూతనంగా నిర్మించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే బిఆర్ఎస్ హయాంలో సబితా ఇంద్రా రెడ్డి ఓఆర్ఆర్ నుండి ఆలయం వరకు 100 ఫీట్ల రోడ్డును నిర్మిస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. హిందువులకు ఇచ్చిన హామీలు మర్చిపోతారు కానీ జల్పల్లి మున్సిపాలిటీ లో ఒక వర్గానికి ఇచ్చిన హామీని గుర్తుపెట్టుకుని పనులు పూర్తి చేశారని మరి హిందువులు ఏం పాపం చేశారని ప్రశ్నించారు. నియోజకవర్గ వ్యాప్తంగా అనేక చెరువులను నాడు సబితా ఇంద్రారెడ్డి అనుచరులు మరియు రియల్ ఎస్టేట్ వ్యాపారస్తులు కబ్జాలు చేశారని వాటిపై నేటికీ హైడ్రా అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టలేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ బిజెపి అధ్యక్షులు మాజీ చైర్మన్ బరిగెల హేమలత రాజు గౌడ్, మాజీ అధ్యక్షులు రచ్చ లక్ష్మణ్, మాజీ ఫ్లోర్ లీడర్ శివకుమార్ గౌడ్, మాజీ కౌన్సిలర్లు కాంటెకర్ మధుమోహన్, బోధ యాదగిరి రెడ్డి, రాజామోని రాజు ముదిరాజ్, జాపాల సుధాకర్, బాకీ విలాస్, బిజెపి సీనియర్ నాయకులు తలారి శ్రీను, శ్రీనివాస్ నాయక్, స్వామి గౌడ్, రవి నాయక్, శ్రీశైలం యాదవ్, మహేష్ బిజెపి మరియు బీజేవైఎం నాయకులు పాల్గొన్నారు.

# నేడు 20వ వార్డులో బాకీ కార్డు పంపిణీ చేస్తాం

**సింగిరెడ్డి**




**వనపర్తి, అక్టోబర్ 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 22 నెలలు గడిచినా, ఆరు గ్యారంటీలు అమలు చేయకుండా మహిళలు, రైతులు, నిరుద్యోగులు, విద్యార్థులకు బకాయిగా ఉన్న నిధులు తెలియజేసే బాకీ కార్డులను ఇంటింటికి పంపిణీ చేయనున్నారు. ఈ సందర్భంగా సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ప్రజలకు బాకీ కార్డులు అందజేస్తూ, రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ నాయకులను ప్రశ్నించాలని విజ్ఞప్తి చేయనున్నారు. నేడుఉదయం 7 గంటలకు 20వ వార్డులోని ఆంజనేయ స్వామి దేవాలయం వద్ద ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. పాత్రికేయ మిత్రులు కూడా నేడుజరగబోయే బాకీ కార్డుల పంపిణీ కార్యక్రమానికి ప్రింట్,ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు తప్పక హాజరై సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు.

# 9న బీఆర్ఎస్ ఆధ్వర్యంలో చలో బస్ భవన్

**మాజీ మంత్రి తలసాని**



**హైదరాబాద్,అక్టోబర్ 07 ( నీలగిరి ఎక్స్ ప్రెస్)**
గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో టీజీఎస్ ఆర్టీసీ బస్సు ఛార్జీలను పెంచిన సంగతి తెలిసిందే. ఆర్టీసీ చార్జీల పెంపునకు నిరసనగా ఈ నెల 9వ తేదీన బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఛలో బస్ భవన్ కి పిలుపునిచ్చినట్లు మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. నందినగర్ నుంచి కేటీఆర్, మెహిదీపట్నం నుంచి హరీష్ రావు, మహేశ్వరం నుంచి సబితా ఇంద్రారెడ్డి, సికింద్రాబాద్ నుంచి తలసాని శ్రీనివాస్ యాదవ్, చిలకలగూడ నుంచి పద్మారావు గౌడ్, దిల్?సుఖ్?నగర్ నుంచి సుధీర్ రెడ్డి, ఉప్పల్ నుంచి లక్ష్మారెడ్డి, ముషీరాబాద్ నుంచి ముఠా గోపాల్, మల్కాజిగిరి నుంచి మర్రి రాజశేఖర్ రెడ్డి, కుత్బుల్లాపూర్ నుంచి వివేకానంద్ గౌడ్, కూకట్‌పల్లి నుంచి కృష్ణారావు నుంచి బస్ భవన్‌కు చేరుకుని ఆర్టీసీ ఎండీకి వినతి పత్రం ఇవ్వనున్నారు. పెంచిన ఆర్టీసీ బస్ ఛార్జీలను తగ్గించాలని డిమాండ్ చేయనున్నారు.

## జంగమోనిపల్లిలో మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు జి. చెన్నయ్య పర్యటన



**తెలకపల్లి, అక్టోబర్ 7 అక్టోబర్ 7(నీలగిరి ఎక్స్ ప్రెస్):** నాగర్‌కర్నూల్ జిల్లా తెలకపల్లి మండల పరిధిలోని జంగమోనిపల్లి గ్రామంలో ఇటీవల దుర్గామాత దర్శనానికి మాల కులానికి చెందిన వారిని నిరాకరించిన సంఘటన రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర సంచలనం రేపిన విషయం తెలిసిందే. ఈ సంఘటనను ఖండిస్తూ మంగళవారం మాల మహానాడు జాతీయ అధ్యక్షులు జి. చెన్నయ్య గ్రామాన్ని సందర్శించారు. దళితవాడలో పర్యటించిన ఆయన, బాధిత కుటుంబాలతో మాట్లాడి సంఘటన వివరాలు తెలుసుకున్నారు. అనంతరం యాదవ సంఘం పెద్దలతో సమావేశమై, “అందరం కలిసి జీవించాలి. కుల వివక్షకు చోటు లేకుండా చట్టబద్ధంగా ముందుకు సాగాలి” అని సూచించారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రచించిన చట్టాలపై అవగాహన కల్పిస్తూ, “దళితులు అధైర్యపడవద్దు. చట్టం మీకు అండగా ఉంది. మాల మహానాడు ఎల్లప్పుడూ మీతో ఉంటుంది” అని ధైర్యం నింపారు. ఇలాంటి అవమానకర సంఘటనలు పునరావృతం కాకుండా గ్రామ ప్రజా ప్రతినిధులు, యాదవ సంఘం నేతలు చర్యలు తీసుకోవాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు బూరు వెంకటేశ్వర్లు, ఎన్ని పోతుల అనిల్, కుందా మల్లికార్జున్, కిన్నెర పాండు, గాజుల రాజు, సుధాకర్ బాబు, మనోహర్, గ్రామ పెద్దలు, కుల పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## ఎంబీబీఎస్ సీటు సాధించిన నాయని కావేరికి ఉప్పల వెంకటేష్ అండ




**కల్వకుర్తి, అక్టోబర్ 7(నీలగిరి ఎక్స్ ప్రెస్):** మాడుగుల మండలంలోని కలకొండ గ్రామానికి చెందిన నిరుపేద విద్యార్థిని నాయని కావేరి ఎంబీబీఎస్ మెడికల్ ప్రవేశ పరీక్షలో సీటు సాధించిన సందర్భంగా మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు, ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ శ్రీ ఉప్పల వెంకటేష్ ఆమెకు ఆర్థిక సహాయం అందించారు. విద్యార్థిని తండ్రి సత్యనారాయణ కష్టాలను గుర్తించిన వెంకటేష్, “గ్రామాలలో ఆడపిల్లలు ఉన్నత విద్యలో రాణించడం ఎంతో సంతోషకరం. కల్వకుర్తి నియోజకవర్గంలో కేసరిని ఆదర్శంగా తీసుకొని ఆడపిల్లలు ఉన్నత ఉద్యోగాల్లో రాణించాలి” అని పేర్కొన్నారు. కావేరి చదువుకు 15,000 ఆర్థిక సహాయాన్ని కార్యకర్తల ద్వారా అందించారు. ఈ కార్యక్రమంలో దారమోని గణేష్, వీరబొమ్మ బుచ్చిబాబు, శేఖర్, సాయి తదితరులు పాల్గొన్నారు.

## బాలాజీ సింగ్ ని పరామర్శించిన డోకూరి ప్రభాకర్ రెడ్డి



**కల్వకుర్తి, అక్టోబర్ 7 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** తెలంగాణ మలిదశ ఉద్యమ నాయకులు, నాగర్‌కర్నూల్ జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్, పిసిసి అధికార ప్రతినిధి, రాష్ట్ర పొల్యూషన్ బోర్డ్ సభ్యులు ఠాగూర్ బాలాజీ సింగ్ మాతృమూర్తి సావిత్రిబాయి నిన్న సాయంత్రం హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ విషాద వార్తను తెలుసుకున్న తలకొండపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డోకూరి ప్రభాకర్ రెడ్డి, కల్వకుర్తిలోని బాలాజీ సింగ్ నివాసానికి చేరుకొని సావిత్రిబాయి పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బాలాజీ సింగ్‌ను పరామర్శించి, కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో వెల్జాల్ మాజీ ఉప సర్పంచ్ అజీజ్, మండల కాంగ్రెస్ మైనార్టీ సెల్ అధ్యక్షులు ఎండి ఆరిఫ్, మండల యువజన కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు జి. జనార్ధన్ రెడ్డి, ఆయాఖాన్ తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టరేట్‌లో వాల్మీకి జయంతి



**కరీంనగర్, అక్టోబర్ 7 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** మంగళవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో మహర్షి వాల్మీకి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కలెక్టర్ పమేలా సత్పతి, అధికారులు వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. “వాల్మీకి రామాయణం ద్వారా సత్యం, ధర్మం, న్యాయం విలువలను సమాజానికి చాటారు” అని కలెక్టర్ పేర్కొన్నారు.కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, అదనపు కలెక్టర్లు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## గువ్వల బాలరాజ్ సమక్షంలో బీజేపీలో చేరిన బీఆర్ఎస్ నాయకులు



**వంగూరు, అక్టోబర్ 7 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** వంగూరు మండలంలోని రంగాపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు, అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజ్ సమక్షంలో బీజేపీ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మహేష్ గౌడ్, నవీన్ గౌడ్, కొప్పునూరు నరేష్, శేఖర్, నరేష్, సుభాష్ తదితరులు బీజేపీలో చేరారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు రాగి రామకృష్ణారెడ్డి, మండల అధ్యక్షులు గున్నా ఆనంద్ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు అల్లే భీమయ్య, రవి యాదవ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## సీజెఐపై దాడిని ఖండించిన దళిత సంఘాల నేతలు



**అచ్చంపేట, అక్టోబర్ 7 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్. గవాయి పై అడ్వకేట్ రాకేష్ కిషోర్ షూస్ విసిరిన దాడిని ఖండిస్తూ మంగళవారం అచ్చంపేట అంబేద్కర్ చౌరస్తాలో దళిత సంఘాల ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలతో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ, “జస్టిస్ గవాయి పై దాడి భారత రాజ్యాంగంపై దాడిగా భావించాలి. మత ఉన్మాద శక్తులు ముసుగులో ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నాయి. ప్రధాన న్యాయమూర్తిపై దాడిని ఇప్పటివరకు ఖండించని ప్రధానమంత్రి, రాష్ట్రపతి తక్షణమే స్పందించాలి” అని డిమాండ్ చేశారు. దాడికి పాల్పడిన రాకేష్ కిషోర్‌పై దేశద్రోహం కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని కోరారు. ప్రతిపక్ష నేతలు రాహుల్ గాంధీ, సోనియా గాంధీ, మల్లికార్జున ఖర్గే స్పందించినందుకు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేందర్, మాజీ ఎంపీపీ రామనాథం, శ్రీశైలం, కుందా మల్లికార్జున్, జక్కగోపాల్, కాశన్న యాదవ్, అనిల్, రాజగోపాల్, మహాబలి, లక్ష్మీనారాయణ, విష్ణుమూర్తి, ఆనంద్, మోతె రాజు, పాండు, కే. శ్రీనివాస్, జి. అంజి, కే. అంజి, యాదన్న, జగదీష్, కంచి రామయ్య తదితరులు పాల్గొన్నారు.

## నూతన డిజిపి బి.శివధర్ రెడ్డి కి సన్మానం...



**హైదరాబాద్, అక్టోబర్ 7(నీలగిరి ఎక్స్ ప్రెస్):** రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ గా ఇటీవల పదవి బాధ్యతలు చేపట్టిన లిబి.శివధర్ రెడ్డిని సీనియర్ జర్నలిస్టులు అభినందించారు. తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సమితి రాష్ట్ర మీడియా సెల్ అధ్యక్షుడు బి.వెంకటేశ్వర్లు తెలంగాణ ఫెడరేషన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టు రాష్ట్ర అధ్యక్షుడు పిసాటి జంగారెడ్డి లు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శాలువా కప్పి సత్కరించారు. శాంతి భద్రతల పరిరక్షణకు గాను పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు ఈ సందర్భంగా డిజిపి బి.శివధర్ రెడ్డి తెలిపారు.

## బీసీలకు 42% రిజర్వేషన్లు అమలు చేయాలి



**చిగురుమామిడి, అక్టోబర్ 7 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు రవీందర్, మండలాధ్యక్షుడు రాజ్ కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

## సీజెఐ పై దాడిని ఖండించిన సిపిఐ నేత




**నాగర్‌కర్నూల్, అక్టోబర్ 7(నీలగిరి ఎక్స్ ప్రెస్):** సీజెఐ జస్టిస్ బి.ఆర్. గవాయ్‌పై జరిగిన దాడిని ఖండిస్తూ, అంబేద్కర్ చౌరస్తాలో దళిత హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో నిరసన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎం. బాల నరసింహ మాట్లాడుతూ, “మత ఉన్మాద సంస్కృతి వల్లే ఈ దాడులు జరుగుతున్నాయి. అంబేద్కర్ వాదిగా రాజ్యాంగ పరిరక్షణకు కృషి చేస్తున్న గవాయ్‌పై దాడి జరగడం సనాతనవాదుల అసహనానికి నిదర్శనం” అని అన్నారు. దాడికి పాల్పడిన వారిపై దేశద్రోహం కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నేతలు కొమ్ము భరత్, బండి లక్ష్మీపతి, గోపాల్, శివశంకర్, బిజ్జ, శ్రీను, అంజి, శివకృష్ణ, బాలయ్య, రాములు తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పునుంతలలో వేరుశనగ ఉచిత విత్తనాల పంపిణీ



**ఉప్పునుంతల, అక్టోబర్ 7 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** ఉప్పునుంతల మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో, రైతు ఉత్పత్తిదారుల సంస్థ (ఎఫ్‌పిఒ) సభ్యులకు యాసంగి పంటల సాగు కోసం వేరుశనగ విత్తనాలను ఉచితంగా పంపిణీ చేశారు.

జాతీయ ఆయిల్‌సీడ్ అభివృద్ధి కార్యక్రమం (ఎన్‌ఎమ్‌ఈఓ-ఓఎస్) ద్వారా ఒక్కో రైతుకు 90 కిలోల చొప్పున విత్తనాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ముఖ్య కార్యనిర్వాహక అధికారి కొత్త రవీందర్ రావు, మండల వ్యవసాయ అధికారి రమేష్, వ్యవసాయ విస్తరణ అధికారి మంజుల, సంఘం సిబ్బంది, పలువురు రైతులు పాల్గొన్నారు.

## కేసముద్రం సర్కిల్‌కి కొత్త సీఐ



**మహబూబాబాద్, అక్టోబర్ 7 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** కొత్తగా ఏర్పడిన కేసముద్రం సర్కిల్‌కు సీఐగా బాధ్యతలు స్వీకరించిన వై. సత్యనారాయణ, ఎస్ఐ కే. క్రాంతి మంగళవారం జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ (ఐపీఎస్)ను జిల్లా పోలీస్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు.

## జాతీయ జెండా వద్ద చెత్త వేయడంపై ప్రజల్లో ఆగ్రహం




**కరీంనగర్, అక్టోబర్ 7 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** విశ్వబ్రాహ్మణ స్ట్రీట్ తిలక్ రోడ్డులో జాతీయ జెండా గద్దె వద్ద చెత్త వేయడం ప్రజల్లో తీవ్ర ఆగ్రహాన్ని కలిగిస్తోంది. ఈ విషయాన్ని ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లగా తక్షణ చర్యలు తీసుకున్నారు.

అయినప్పటికీ మళ్లీ అదే ప్రాంతంలో చెత్త వేయడం కొనసాగుతోంది.జాతీయ జెండా గౌరవాన్ని కాపాడేందుకు చెత్త వేయడాన్ని అరికట్టి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. జెండా గద్దె చుట్టూ ఫినిషింగ్ వైరు ఏర్పాటు చేసి, పూల మొక్కల కుండీలు పెట్టాలని మున్సిపల్ అధికారులను ప్రజల పక్షాన విజ్ఞప్తి చేశారు.


## ఘనంగా మహర్షి వాల్మీకి జయంతి వేడుకలు



**తూప్రాన్, అక్టోబర్ 7 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** భారతీయ ఋషి, ఆదికవి మహర్షి వాల్మీకి జయంతిని పురస్కరించుకొని మంగళవారం తూప్రాన్ మున్సిపల్ కార్యాలయంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. కమీషనర్ పాతూరి గణేష్ రెడ్డి ఆధ్వర్యంలో మున్సిపల్ సిబ్బంది పాల్గొని మహర్షి వాల్మీకి విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.

## ఘనంగా వాల్మీకి మహర్షి జయంతి

### బోయ కులస్తులను ఎస్టీ జాబితాలో చేర్చాలి: మహేందర్



**ఎలిగేడు, అక్టోబర్ 7 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** ఎలిగేడు మండల కేంద్రంలోని వాల్మీకి సేవా సంఘం భవనంలో మంగళవారం వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమ్మడి కరీంనగర్ జిల్లా వాల్మీకి బోయ సంఘం అధ్యక్షులు గుడుగుల మహేందర్ మాట్లాడుతూ, "కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చిత్తశుద్ధి ఉంటే వాల్మీకి బోయ కులస్తులను తక్షణమే ఎస్టీ జాబితాలో చేర్చాలి" అని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో వాగ్దానాలు చేసి, అనంతరం మోసం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వాల్మీకి బోయలు ఆర్థికంగా, రాజకీయంగా, విద్యాపరంగా వెనుకబడిన వర్గమని, పుట్టుకతోనే గిరిజన తెగకు చెందినవారని పేర్కొన్నారు. తెలంగాణలో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఎస్టీలుగా, మిగతా జిల్లాల్లో బీసీలుగా వర్గీకరించడం అన్యాయమని, ఒకే కులానికి రెండు రిజర్వేషన్లు సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు ముత్కల మల్లేశం, ఉపాధ్యక్షుడు భోగి శ్రీనివాస్, సభ్యులు కుడుదల నరేష్, భూకాల శ్రీకాంత్, సప్పుల సురేష్, బలంతుల చిన్న భూమయ్య, మీనుగు లచ్చయ్య, బలవంతుల తిరుపతి, కెంగార్ల అంజయ్య, గుజ్జుల కనకయ్య, కుడుదుల తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేకు ఆలయ కమిటీల కృతజ్ఞతలు



**ఎలిగేడు, అక్టోబర్ 7 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** శివపల్లి గ్రామంలో పెద్దపల్లి శాసనసభ సభ్యులు చింతకుంట విజయరమణారావు నివాసంలో మంగళవారం సుల్తానాబాద్, పెద్దపల్లి మండలాల పలు ఆలయ కమిటీల సభ్యులు కలిసి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.రామునిపల్లి శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థాన పునర్నిర్మాణానికి రూ.50 లక్షలు, పెద్దకల్వల శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయానికి రూ.40 లక్షల నిధులు దేవాదాయ శాఖ ద్వారా మంజూరైన నేపథ్యంలో, కమిటీ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం ఎమ్మెల్యే విజయరమణారావును శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కొమరం భీమ్‌కు ఘన నివాళులు



**కెరిమేరి, అక్టోబర్ 7 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** విప్లవ వీరుడు కొమరం భీమ్ వర్ధంతి సందర్భంగా మంగళవారం రాష్ట్ర మంత్రులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్, జూపల్లి కృష్ణారావు ఆసిఫాబాద్ జిల్లా కెరిమేరి మండలం జోడేఘాట్‌లోని విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. "కొమరం భీమ్ త్యాగం ఆదివాసీ సమాజ ఆత్మగౌరవానికి ప్రతీక. ఆయన చూపిన మార్గం యువతకు శాశ్వత స్ఫూర్తి" అని మంత్రి లక్ష్మణ్ కుమార్ పేర్కొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికల వేళ ఎమ్మెల్యేతో మంత్రుల కీలక భేటీ



**ఎలిగేడు, అక్టోబర్ 7 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** స్థానిక సంస్థల ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం వ్యూహాత్మకంగా ముందుకెళ్తోంది. ఎలిగేడు మండల పరిధిలోని శివపల్లి గ్రామంలో పెద్దపల్లి శాసనసభ సభ్యులు చింతకుంట విజయరమణారావు నివాసంలో మంగళవారం రాష్ట్ర మంత్రులు జూపల్లి కృష్ణారావు, అల్లూరి లక్ష్మణ్ కుమార్ ఎమ్మెల్యేతో భేటీ అయ్యారు. ఆదిలాబాద్ పర్యటనలో భాగంగా మార్గమధ్యంలో మంత్రులు ఎమ్మెల్యే నివాసానికి చేరుకోగా, విజయరమణారావు ఘన స్వాగతం పలికారు. అనంతరం పెద్దపల్లి నియోజకవర్గ అభివృద్ధి, స్థానిక సంస్థల ఎన్నికల వ్యూహాలపై కూలంకషంగా చర్చించారు. పేద, బలహీన వర్గాల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని మంత్రులు సూచించారు. స్థానిక నేతల మధ్య సమన్వయం కల్పిస్తూ, ప్రతి స్థానంలో కాంగ్రెస్ జెండా ఎగురవేయాలన్నది లక్ష్యమని తెలిపారు.

## ఎస్పీ కార్యాలయంలో వాల్మీకి మహర్షి జయంతి




**నాగర్‌కర్నూల్, అక్టోబర్ 7 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** జిల్లా ఎస్పీ కార్యాలయంలో మంగళవారం వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సంస్కృత సాహిత్యంలో ఆదికవి, రామాయణ మహాకావ్య రచయిత వాల్మీకి మహర్షికి జిల్లా ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ పూలదండ వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఎన్. వెంకటేశ్వర్లు, ఆర్ఐ జగన్, ఎస్‌బీసీఐ కనకయ్య, డీసీఆర్బీసీఐ ఉపేందర్ రావు, సీసీఎస్సీఐ శంకర్, ఎస్పీసీసీ బాలరాజు, ఏవో కృష్ణయ్యతో పాటు దాదాపు 50 మంది పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## రైతులకు న్యాయం చేసేలా భూసేకరణ: రైతు కమిషన్



**హైదరాబాద్, అక్టోబర్ 7 (నీలగిరి ఎక్స్ప్రెస్):** రాష్ట్రంలో పరిశ్రమల అభివృద్ధి కోసం చేపట్టే భూసేకరణలో రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటున్నందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, రాష్ట్ర ప్రభుత్వానికి రైతు కమిషన్ అభినందనలు తెలిపింది. ఈ మేరకు మంగళవారం సచివాలయంలో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో రైతు కమిషన్ బృందం సమావేశమైంది. భూములు ఇచ్చే రైతులకు నష్టపరిహారం, ఇంటి స్థలం, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలన్న ప్రభుత్వ నిర్ణయం హర్షించదగ్గదిగా పేర్కొన్నారు.ఈ సమావేశంలో రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, సభ్యులు కేవీఎన్ రెడ్డి, భవానీ రెడ్డి, సీడ్ కార్పొరేషన్ చైర్మన్ అన్వేష్ రెడ్డి, స్పెషల్ సీఎస్ సంజయ్ కుమార్, టీజీఐఐసీ ఎండి శశాంక్, కమిషన్ మెంబర్ సెక్రటరీ గోపాల్, వ్యవసాయ అధికారి హరి వెంకట ప్రసాద్ పాల్గొన్నారు. రంగారెడ్డి జిల్లాలో 2005 నుండి హార్డ్‌వేర్ పార్క్, ఫ్యాబ్ సిటీ, ఫార్మా సిటీ కోసం చేపట్టిన భూసేకరణపై చర్చించారు. గత బీఆర్ఎస్ హయాంలో రైతులకు తగిన నష్టపరిహారం ఇవ్వకపోవడం వల్ల ఇబ్బందులు ఎదురయ్యాయని పేర్కొన్నారు. ఫార్మా సిటీని రద్దు చేసి, రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవడం సంతోషకరమని కమిషన్ అభిప్రాయపడింది. ఇంకా నష్టపరిహారం అందని రైతులకు న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరింది.

## జర్నలిస్టులకు అండగా ఉంటా ఎమ్మెల్యే విజయరమణ రావు



**కమాన్‌పూర్, అక్టోబర్ 7 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** పత్రికా విలేకరుల సంక్షేమం, ప్రెస్ క్లబ్ అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తానని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు తెలిపారు. జిల్లా కేంద్రంలో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా కలిసి ఏర్పాటు చేసిన నూతన ప్రెస్ క్లబ్‌ను మంగళవారం ఆయన ప్రారంభించారు. అనంతపురం కార్యవర్గాన్ని శాలువాలతో సన్మానించారు. 'ప్రభుత్వ పథకాలు జర్నలిస్టులకు చేరేలా కృషి చేస్తాను" అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఈర్ల స్వరూప, న్యాయవాది ఉప్పు రాజు, కాంగ్రెస్ నాయకులు, సీనియర్ జర్నలిస్టులు, ప్రెస్ క్లబ్ ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.

## ఓటు చోరీపై కాంగ్రెస్ ఉద్యమం



**మహేశ్వరం, అక్టోబర్ 7 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలంలోని అమీర్‌పేట్ గ్రామంలో ఓటు చోరీకి వ్యతిరేకంగా సంతకాల సేకరణ కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సిహెచ్ యాదయ్య, గ్రామ శాఖ అధ్యక్షులు హైతాబాద్ రాజేందర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, "ఓటర్ల జాబితాలో జరుగుతున్న అక్రమాలకు సంబంధిత అధికారులు బాధ్యత వహించాలి. తొలగించిన అర్హుల ఓట్లను తిరిగి నమోదు చేసి, ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందే ఫోటోలతో కూడిన ఓటర్ల జాబితాను బహిరంగపరచాలి" అని డిమాండ్ చేశారు. ఏఐసీసీ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, నియోజకవర్గ ఇంచార్జ్ కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహించారని తెలిపారు. బీజేపీ చేస్తున్న అక్రమ ఓటు చోరీపై దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ పోరాటం చేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కడల భాస్కర్, సంభ మల్లేష్, కెజె ప్రసాద్, వర్కల రమేష్, సిహెచ్ బాలకృష్ణ, దప్పు నరసింహ, ఎర్ర నవీన్ కుమార్, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీలో భారీగా యువత చేరిక





**మహేశ్వరం, అక్టోబర్ 7 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలంలోని పెద్దపులి నాగారం గ్రామంలో బీజేపీ పార్టీకి మద్దతుగా యువత పెద్ద ఎత్తున పార్టీలో చేరారు. మాజీ ఎంపీటీసీ కుండే వెంకటేష్, ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి కుండే కుమార్ ఆధ్వర్యంలో యువత స్వచ్ఛందంగా పార్టీలో చేరారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ విజయానికి కృషి చేస్తామని వారు తెలిపారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరికీ బీజేపీ కండువా కప్పి ఆహ్వానించారు.

## దొంగఓట్లు ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టు: కేఎల్ఆర్



**కందుకూర్, అక్టోబర్ 7 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** రంగారెడ్డి జిల్లా కందుకూర్ మండలంలోని ఆకుల మైలారంలో ఓట్ల చోరీపై కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జ్ కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి (కేఎల్ఆర్) మాట్లాడుతూ, "కాంగ్రెస్ అనుకూల వర్గాల ఓట్లను బీజేపీ, ఎన్నికల సంఘం కుట్రపూరితంగా తొలగిస్తున్నాయి. ఇది రాజ్యాంగంపై దాడికి సమానం" అని విమర్శించారు. అంబేద్కర్, జగ్జీవన్ రామ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం, "బీఆర్ఎస్ హయాంలో జల్‌పల్లి మున్సిపాలిటీలో వేలాది దొంగఓట్లు నమోదయ్యాయి. అర్హుల ఓట్లు తొలగించి, బయట వ్యక్తుల ఓట్లు నమోదు చేయడం హేయమైన చర్య. ప్రతీ బూత్ స్థాయిలో వంద సంతకాలు సేకరించి ఎన్నికల సంఘానికి నిరసన తెలపాలి" అని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పలు పార్టీల నాయకులు కాంగ్రెస్ కండువాలు కప్పుకొని పార్టీలో చేరారు. కార్యక్రమంలో కందుకూర్, మహేశ్వరం మండల నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, మహిళా విభాగం నాయకురాళ్లు పాల్గొన్నారు.

# రాజ్యాంగంపై దాడిగా పరిగణించాలి

పరశురాములు



**కల్వకుర్తి, అక్టోబర్ 7 (నీలగిరి ఎక్స్ప్రెస్):**
సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్. గవాయ్‌పై చెప్పుతో దాడిని ఖండిస్తూ కల్వకుర్తి అంబేద్కర్ విగ్రహం వద్ద కెవిపిఎస్ ఆధ్వర్యంలో మంగళవారం నిరసన నిర్వహించారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పులిజాల పరశురాములు మాట్లాడుతూ, "ఇది వ్యక్తిగత దాడి కాదు, రాజ్యాంగంపై దాడి. దాడికి ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీ బాధ్యత వహించాలి" అని అన్నారు. బహుజన మేధావి తెలంగాణ జంగయ్య, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బి. ఆంజనేయులు మాట్లాడుతూ, "దళితుడిగా జస్టిస్ గవాయ్ ఉన్నందుకే ఈ కక్ష" అని విమర్శించారు. రాకేష్ కిషోర్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కెవిపిఎస్ మండల అధ్యక్షులు నారుమల్ల కుర్మయ్య, గడ్డం నిరంజన్, నవీన్ కుమార్, పర్వతాలు శ్రీనివాసులు, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు చిలుక బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పాలస్తి నాపై ఇజ్రాయిల్ దాడి పై ఏఐవైఎఫ్ నిరసన




**వనపర్తి,అక్టోబర్ 7(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
వనపర్తి పట్టణం అంబేద్కర్ చౌక్ లో ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో పాలస్తి నాపై ఇజ్రాయిల్ దాడిపై నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ జిల్లా ఇన్చార్జి రమేష్, జిల్లా కార్యదర్శి ఎండి కుతుబ్ మాట్లాడారు. అమెరికా ప్రేరేపణతో పాలస్థి నాపై ఇజ్రాయిల్ దాడి దుర్మార్గమన్నారు. పిల్లలు వృద్దులు ఎందరో ప్రాణాలు కోల్పోయారని ఇజ్రాయిల్ దాడిని అమెరికా విధానాన్ని ప్రపంచం ఖండించాలన్నారు. యుద్ధం ఆపాలని ప్రపంచశాంతి వర్ధిల్లాలని, అమెరికా సామ్రాజ్యవాదం నశించాలని నినాదాలు చేశారు. ఇజ్రాయిల్ యుద్ధం ఆపకుంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవలసి వస్తుందన్నారు. ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో పోరాటాన్ని ఉదృతం చేస్తామన్నారు. ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కుతుబ్,శ్రీనివాసులు,మహమ్మద్,ఎండి నదీమ్,వంశీ,లక్ష్మీనారాయణ,బాలిమియా తదితరులు పాల్గొన్నారు.

# గొల్లపల్లి రిజర్వాయర్, బుద్ధారం స్టేజ్ 2 రిజర్వాయర్ల ఏర్పాటు

ముఖ్యమంత్రితో ప్రత్యేకంగా సమావేశమైన వనపర్తి ఎమ్మెల్యే



**వనపర్తి,అక్టోబర్ 7 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
ఘనపసముద్రం రిజర్వాయర్ ల్యాండ్ ఎక్వేషన్ నిధుల మంజూరు గురించి చర్చించిన ఎమ్మెల్యే. వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి మంగళవారం రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి తో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి కి దసరా పండుగ శుభాకాంక్షలు తెలియజేసిన ఎమ్మెల్యే వనపర్తి నియోజకవర్గ పరిధిలో నిర్మాణం చేపట్టబోయే పలు రిజర్వాయర్ లపై సుదీర్ఘంగా చర్చించారు. నూతనంగా నిర్మించబోయే గొల్లపల్లి రిజర్వాయర్, బుద్ధారం స్టేజ్ 2 రిజర్వాయర్ నిర్మాణాలను చేపడితే నియోజకవర్గం పరిధిలో భవిష్యత్ తరాలకు సైతం సాగునీటి ఎద్దడి ఉండదని ఎమ్మెల్యే అభ్యర్థించారు. ఇందుకు ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. అదేవిధంగా ఖిల్లా ఘనపురం మండలంలోని ఘనపసముద్రం రిజర్వాయర్ ఏర్పాటు లో భూములు కోల్పోయిన అన్నదాతలకు వెంటనే నష్టపరిహారం చెల్లించే విధంగా చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే ముఖ్యమంత్రిని కోరడంతో స్పందించిన ముఖ్యమంత్రి వెంటనే రైతులకు నష్టపరిహారం మంజూరు చేయనున్నట్లు తెలిపారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. వనపర్తి అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్న రాష్ట్ర ముఖ్య మంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి ఎమ్మెల్యే ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

# అపరిశుభ్రంగా మారిన గంజ్ హై స్కూల్ పరిసరాలు





**కరీంనగర్, అక్టోబర్ 7 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
సిక్కువాడి మార్కెట్ ప్రాంతంలో ఉన్న పురాతన గంజ్ హై స్కూల్ ప్రహరీ వద్ద కొంతమంది బాటసారులు మూత్ర విసర్జన చేస్తుండటంతో పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయి. పిల్లలు చదువుకునే విద్యాలయం వద్ద ఇటువంటి కార్యకలాపాలకు తావు లేకుండా మున్సిపల్ అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. మార్కెట్ ప్రాంతంలో సులభ సౌకర్యాల కోసం సులభ్ కాంప్లెక్స్ ఏర్పాటు చేయాలని, స్కూల్ కాంపౌండ్ చుట్టూ ఫినిషింగ్ వైరు ఏర్పాటు చేయాలని ప్రజలు నీలగిరి ఎక్స్‌ప్రెస్ పత్రిక ద్వారా విజ్ఞప్తి చేశారు.

# జోనల్ క్రీడా పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే మల్ రెడ్డి



**ఇబ్రహీంపట్నం, అక్టోబర్ 7 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
గురుకుల విద్యాపీట్ ఆవరణలో స్కూల్ గేమ్స్ ఆఫ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జోనల్ స్థాయి కబడ్డీ, వాలిబాల్, ఖోఖో పోటీలను మంగళవారం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయి" అని పేర్కొన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ గురునాథ్ రెడ్డి, మాజీ ఎంపీపీ రాచర్ల వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ విష్ణువర్ధన్ రెడ్డి, స్కూల్ గేమ్స్ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

# మాడుగులలో యువతి అదృశ్యం



**మాడుగుల, అక్టోబర్ 7 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
మాడుగుల మండలంలోని కలకొండ గ్రామానికి చెందిన తాండ్ర పుష్ప (25) అనే చెవిటి, మూగ యువతి అదృశ్యమైంది. డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్న ఆమె, సెప్టెంబర్ 9న హనుమకొండకు కాలేజీకి వెళ్తున్నానని ఇంట్లో చెప్పి బయలుదేరినప్పటి నుంచి ఆచూకీ లేదు. హాస్టల్ వార్డెన్ ప్రకారం, ఆమె హాస్టల్‌కు రాలేదని, అదే కాలేజీలో చదువుతున్న సంపత్ కుమార్ కూడా కనిపించడం లేదని తెలిపారు. అతనిపై కుటుంబ సభ్యులకు అనుమానం ఉంది. పుష్ప ఎరుపు రంగు చర్మం, గుండ్రటి ముఖం కలిగి, ఆకుపచ్చ చుడిదార్ ధరించి వెళ్లినట్లు సమాచారం. ఎత్తు 5 అడుగుల ఒక అంగుళం. ఫోన్ నెంబర్ 8790332886 కలిగిన రెడ్మీ ఫోన్ కూడా అందుబాటులో లేదు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని మాడుగుల పోలీసులు తెలిపారు.

# కొండగట్టు గిరి ప్రదక్షిణలో భక్తుల సందడి



**కరీంనగర్, అక్టోబర్ 7 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
పౌర్ణమి సందర్భంగా మంగళవారం కొండగట్టు ఆంజనేయస్వామి గిరి ప్రదక్షిణ కార్యక్రమం వైభవంగా జరిగింది. వాసవి క్లబ్ కపుల్స్ కరీంనగర్ ఆధ్వర్యంలో సురేశ్ ఆత్మారం గురుస్వామి నేతృత్వంలో 300 మంది భక్తులు శ్రీరామ జయరామ బజనలతో గిరి ప్రదక్షిణ పూర్తి చేశారు. కార్యక్రమంలో వాసవి క్లబ్ అధ్యక్షుడు జిల్లా జగదీష్, కొలిపాక శ్రీనివాస్, సుద్దాల వెంకటేష్, బోడ్లా శ్రీకిషన్, బాలాజీ, సంతోష్, పైడ శ్రీనివాస్, యోగా సభ్యులు, ఆర్య వైశ్య మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబానికి పట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి పరామర్శ



**ఎల్‌బీ నగర్, అక్టోబర్ 7 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
బి.ఎన్. రెడ్డి డివిజన్ టీచర్స్ కాలనీకి చెందిన పోలే చంద్రశేఖర్ (27) అమెరికా టెక్సాస్‌లోని డల్లాస్ నగరంలో గుర్తు తెలియని దుండగుల కాల్పుల్లో మృతి చెందారు. చంద్రశేఖర్ తండ్రి జగన్మోహన్ 2019లో ఎల్బీనగర్ నియోజకవర్గం నుండి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేశారు. కుటుంబానికి రాజకీయ నేపథ్యం ఉంది. ఈ ఘటనపై స్పందించిన ఇబ్రహింపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి, చంద్రశేఖర్ ఇంటికి వెళ్లి కుటుంబాన్ని పరామర్శించారు. ప్రభుత్వం తరఫున అన్ని విధాల సహాయం అందిస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో జిహెచ్ఎంసి కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ దర్పల్లి రాజశేఖర్ రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ పన్యాల జయపాల్ రెడ్డి, శశిధర్ రెడ్డి, వినయ్ పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

# మైనర్ బాలికపై అత్యాచారం, హత్య ఘటనా స్థలాన్ని పరిశీలించినజిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్



**నల్లగొండ ,అక్టోబర్ 7 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
నల్లగొండ టూ టౌన్ పరిధిలోని డైట్ స్కూల్ సమీపంలో మైనర్ బాలికపై జరిగిన అత్యాచారం, హత్య ఘటన స్థలాన్ని పరిశీలించిన ఎస్పీ శరత్ చంద్ర పవార్ అనంతరం టూ టౌన్ పోలీస్ స్టేషన్ సందర్శించి, హత్య కేసు విచారణలో పురోగతి, సాక్ష్యాధారాల సేకరణ, నిందితుల వివరాలు గురించి అడిగి తెలుసుకున్నారు ప్రధాన నిందితుడు గడ్డం కృష్ణ పై రేప్ మరియు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి, ఇంకా ఎవరైనా ఈ ఘటనలో పాలుపంచుకున్నారా అనే కోణంలో విచారణ చేయాలని ఆదేశించారు పూర్తి ఆధారాలు, సాక్ష్యాలు సేకరించి నిందితులకు త్వరగా కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకుంటామని, ఆడపిల్లలపై అఘాయిత్యాలు, హత్యాచారాలకు పాల్పడితే ఎంతటి వారినైనా వదిలే ప్రసక్తే లేదని హెచ్చరించారు.

# హజరత్ లతీఫ్ షా వలి ఉర్స్-ఎ-షరీఫ్ ఏర్పాట్లను పరిశీలించిన మున్సిపల్ కమిషనర్ ముసాబ్ అహ్మద్



**నల్లగొండ ,అక్టోబర్ 7 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
మునిసిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్, డి.ఇ., ఎ.ఇ., శానిటరీ ఇన్‌స్పెక్టర్‌తో కలిసి దర్గా పరిసరాల్లో ఏర్పాట్లను సమీక్షించారు అనంతరం ఇనామ్‌దార్లు, ముత్తవల్లీలు, ఉర్స్ కమిటీ సభ్యులతో ఏర్పాట్లపై సమగ్ర చర్చ జరిపారు ఉర్స్ ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎటువంటి లోటుబాట్లు లేకుండా అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు సయ్యద్ సమాద్, ఖలీల్, ముత్తవల్లి సమీ ఉల్లా ఖాద్రీ, గౌస్ ఉల్లా ఖాద్రీ, ఉబైద్ ఉల్లా ఖాద్రీ, సల్మాన్ ఖాద్రీ మరియు ఇతర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# "కాంగ్రెస్ బాకీ కార్డు"తో ఇంటింటి ప్రచారం




**కమాన్‌పూర్, అక్టోబర్ 7 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ ఆదేశాల మేరకు కమాన్‌పూర్ మండలంలోని గుండారం, జూలపల్లి, పెంచికల్‌పేట్, సిద్దిపల్లె గ్రామాల్లో మంగళవారం "కాంగ్రెస్ బాకీ కార్డులు" గడపగడపకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ నాయకులు మాట్లాడుతూ, "ఆరు గ్యారంటీలు అమలు చేయని కాంగ్రెస్ నాయకులను స్థానిక ఎన్నికల్లో నిలదీయాలి. ఓటుతో బుద్ధి చెప్పాలి. ప్రతి గ్రామంలో గులాబీ జెండా ఎగురాలి" అని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల బీఆర్‌ఎస్ పార్టీ మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# జూబ్లీహిల్స్‌లో గులాబీ జెండా ఎగురాలి: వివేకానంద్



**బోరబండ, అక్టోబర్ 7 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
జూబ్లీహిల్స్ నియోజకవర్గం బోరబండ డివిజన్ అన్నా నగర్‌లో మంగళవారం బీఆర్‌ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్, ఎమ్మెల్యే అభ్యర్థి మాగంటి సునీతా గోపీనాథ్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా "అన్నా నగర్ బస్తీని నిలబెట్టింది గోపన్ననే. సునితమ్మ గెలుపుతో జూబ్లీహిల్స్‌లో మళ్లీ గులాబీ జెండా ఎగురాలి" అని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు.
కాంగ్రెస్ పార్టీ ప్రజలను మోసం చేస్తోందని, ఆరు గ్యారంటీల అమలుపై నిలదీయాలని పిలుపునిచ్చారు. ప్రచారంలో మాగంటి వాత్సల్యనాథ్, డివిజన్ అధ్యక్షుడు క్రిష్ణ మోహన్, నాయకులు విజయ్ కుమార్, వసంత రావు, మహిళా నాయకురాళ్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఘనంగా వాల్మీకి జయంతి



**ఆల్విన్ కాలనీ, అక్టోబర్ 7 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని జన్మభూమి కాలనీలో ఆదికవి వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు.శ్రీ వాల్మీకి బోయ కిషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో PAC చైర్మన్ ఆరెకపూడి గాంధీ, కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్, సీనియర్ నాయకుడు రఘునాథ్ రెడ్డి పాల్గొని మహర్షి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ, "వాల్మీకి మహర్షి సంస్కృత సాహిత్యంలో ఆదికవి. రామాయణాన్ని రచించిన మహాముని. ఆయన జీవితం స్ఫూర్తిదాయకం" అని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, మహిళలు, కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గాజులరామారంలో సీసీ రోడ్డు ప్రారంభం



**గాజులరామారం, అక్టోబర్ 7 (నీలగిరి ఎక్స్ప్రెస్):**
125 డివిజన్ పరిధిలోని సంస్కృతి ఎంక్లేవ్, ద్వారకా నగర్ ఫేస్-2 కాలనీల్లో రూ.34 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు మంగళవారం ప్రారంభమైంది. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ప్రత్యేక నిధుల ద్వారా ఈ రోడ్డు నిర్మాణానికి మంజూరు చేయించారు. కార్యక్రమంలో కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేస్తూ హన్మంత్ రెడ్డిని శాలువాతో సత్కరించారు. సీనియర్ నాయకులు, కాలనీ ప్రతినిధులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జస్టిస్ గవాయ్‌పై దాడిని ఖండించిన మల్లెపల్లి జగన్



**కల్వకుర్తి, అక్టోబర్ 7 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్. గవాయ్‌పై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని కల్వకుర్తి సీనియర్ అడ్వకేట్ మల్లెపల్లి జగన్ తెలిపారు. పత్రిక సమావేశంలో మాట్లాడుతూ, "ఈ దాడి న్యాయవ్యవస్థపై దాడిగా పరిగణించాలి. న్యాయస్థానాలకు చెడ్డ పేరు తెచ్చే న్యాయవాదులను ఉపేక్షించరాదు. దాడికి పాల్పడిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలి" అని అన్నారు.

# సీజేఐ జస్టిస్ గవాయిపై దాడి యత్నచర్యను తీవ్రంగా ఖండించిన కాంగ్రెస్ ఎస్సీ సెల్



**దేవరకొండ,అక్టోబర్ 07 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
భారత సర్వోన్నత న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ బి.ఆర్. గవాయి పై కోర్టు హాలులో జరిగిన దాడి ప్రయత్నం ఘటనను కేవలం న్యాయవ్యవస్థపై దాడిగా మరియు ఆయన దళిత సామాజిక వర్గం నుండి దేశంలో అత్యున్నత రాజ్యాంగ పదవిని అధిరోహించడం వల్లే లక్ష్యంగా చేసుకున్నారనే కుల దురభిమానం కోణంలో జరిగిందని కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ నల్గొండ జిల్లా ఉపాధ్యక్షులు యేకుల సురేష్ ఈ చర్యను తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు యేకుల సురేష్ మాట్లాడుతూ, ఈ దాడి రాజ్యాంగం మరియు అణగారిన వర్గాల ఆత్మగౌరవంపై జరిగిన దాడిగా అభివర్ణించారు. జస్టిస్ గవాయి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ వారసత్వాన్ని అందిపుచ్చుకుని అత్యంత గౌరవప్రదమైన స్థానంలో ఉన్నారని, ఆయనపై దాడి చేయడం వెనుక కుల అసహనం ఉందనే బలమైన అనుమానాన్ని దేశం పరిశీలించాలని ఆయన పేర్కొన్నారు. "ఒక దళితుడు అత్యున్నత పదవిలో ఉంటే, అతడిపై దాడులు చేస్తారా?" అని ఈ చర్య పరోక్షంగా ప్రశ్నిస్తోందని సురేష్ ఆవేదన వ్యక్తం చేశారు.ఇలాంటి పిరికిపంద చర్యలతో దేశంలో దళితులు మరియు అణగారిన వర్గాలు రాజ్యాంగ పదవులను దక్కించుకోవడాన్ని ఎవరూ అడ్డుకోలేరని యేకుల సురేష్ స్పష్టం చేశారు. రాజ్యాంగం అందించిన హక్కులు, వారి సమర్థత ద్వారానే జస్టిస్ గవాయి వంటి నాయకులు ఉన్నత శిఖరాలను అధిరోహించారని ఆయన గుర్తు చేశారు. ఈ దాడులు వారి నిబద్ధతను, ధైర్యాన్ని ఏమాత్రం ప్రభావితం చేయలేవని, యావత్ దేశం ఈ దాడిని అణగారిన వర్గాల ప్రతినిధిపై జరిగిన దాడిగా పరిగణించి ఖండించాలని ఆయన కోరారు. దాడి యత్నం జరుగుతున్న సమయంలో కూడా చలించకుండా విచారణ కొనసాగించిన జస్టిస్ గవాయి ధైర్యాన్ని, వృత్తి నైపుణ్యాన్ని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ చర్య వారి నిస్వార్థ సేవకు మరియు రాజ్యాంగంపై వారికున్న అచంచలమైన విశ్వాసానికి నిదర్శనమని సురేష్ కొనియాడారు. న్యాయవ్యవస్థపై దాడి చేసేవారికి కోర్టు ధిక్కార చట్టాలు మరియు బార్ కౌన్సిల్ ద్వారా అత్యంత కఠినమైన శిక్షలు విధించి, ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా గట్టి హెచ్చరిక జారీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అదేవిధంగా న్యాయమూర్తుల గౌరవమే రాజ్యాంగం యొక్క గౌరవమని ఆయన నొక్కి చెప్పారు.

# ఓటు చోరీపై సంతకాల సేకరణ





### ఘనంగా వాల్మీకి జయంతి వేడుకలు

**కాజీపేట/శాయంపేట, అక్టోబర్ 7 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
ఓటు చోరీకి వ్యతిరేకంగా రాహుల్ గాంధీ ప్రారంభించిన పోరాటానికి మద్దతుగా మంగళవారం కాజీపేట చౌరస్తా, శాయంపేట మండల కేంద్రాల్లో సంతకాల సేకరణ కార్యక్రమాలు నిర్వహించారు. కాజీపేట కార్యక్రమంలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, పార్లమెంట్ సభ్యురాలు కడియం కావ్య ముఖ్య అతిథులుగా పాల్గొని కేంద్రానికి తమ అభిప్రాయాన్ని తెలియజేశారు. బూత్ స్థాయి నుంచి డివిజన్ స్థాయి వరకు కాంగ్రెస్ కార్యకర్తలు ఇంటింటికీ తిరిగి సంతకాలు సేకరించాలని పిలుపునిచ్చారు. శాయంపేటలో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు సంతకాల సేకరణ ప్రారంభించారు. "ప్రధాని మోడీ ఓటు చోరీతోనే మూడోసారి అధికారంలోకి వచ్చారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు ప్రతి గ్రామంలో కనీసం 100 సంతకాలు సేకరించాలి" అని ఆయన పేర్కొన్నారు. అదే సందర్భంగా వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.
ఎమ్మెల్యే వాల్మీకి చిత్రపటాన్ని పాలతో శుభ్రపరిచి పూలమాల వేసి నివాళులర్పించారు. "వాల్మీకి మహర్షి రచించిన రామాయణం మానవ విలువలకు మార్గదర్శకం. ఆయన జీవితం మహాపురుషులైన రుషులకే నిదర్శనం" అని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కోతులు,కుక్కతో తీవ్ర ఇబ్బందులు

### - భయంతో వణుకుతున్న గ్రామ ప్రజలు





**కోహెడ,అక్టోబర్ 7(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
సిద్దిపేట జిల్లా కోహెడ మండలం సముద్రాల గ్రామంలో కోతులు,కుక్కల బెడదతో గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.పొద్దున లేవగానే వచ్చేసి చిన్న పిల్లలపై వృద్ధుల ఇంట్లో ఉండే మహిళలపై పిల్లలపై వచ్చి దాడి చేయడం కొరకడం కింద పడిపోయి కాళ్లు చేతులు విరగడం మరియు స్కూల్ పిల్లలపై దాడి చేయడం జరుగుతుంది.వీధులలో కూడా కుక్కలు ఎక్కువైపోయి చిన్నపిల్లలని బయటికి వదలాలంటే చాలా భయపడుతున్నారు. రైతుల పంట పొలాల్లో కూరగాయలు,చెట్లు ఏవి పండించిన కూడా చాలా పంట నష్టం చేస్తున్నాయి. అలాగే గ్రామంలో కుక్కల బెడద కూడా చాలా ఎక్కువైపోయింది వీటిని పట్టించుకునే నాథుడే లేడు.కుక్కలు ఆవు దూడల పై దాడి చేసి చంపేస్తున్నాయి రైతులకు తీవ్ర నష్టం జరుగుతుంది.
కష్టపడి రైతులు పొలం దగ్గర కానీ ఇంటి దగ్గర పెరడులో కానీ కూరగాయల చెట్లు పెట్టుకొని పెద్దగా పెరిగిన తర్వాత కాయలు కాసే టైం కి కొరికి వేసి కోతులు విచ్చలవిడిగా చేయడం వల్ల నష్టం జరుగుతుంది. తెలంగాణని ప్రతి గ్రామాలలో కూడా కోతుల సమస్యలు కుక్కల సమస్యలు అధికంగా ఉన్నాయి.గ్రామాలే దేశానికి పట్టుకొమ్మలు అన్నారు.కాబట్టి ముందు గ్రామాలను ప్రజలను కాపాడండి ప్రభుత్వాలు ప్రజా సమస్యలను గాలికి వదిలేసి అడవులను భూములను కబ్జా చేస్తుంటే ప్రజలకు ఇలా ఇబ్బందులు ఎదురవుతున్నాయి.మన తాతల కాలంలో ఒక కోతిని చూడాలని కూడా కనబడకపోయేది ఎందుకిలా సమస్యలు అధికమవుతున్నాయి. కోతులకు పండ్ల తోటలు,చెట్లు గవర్నమెంట్ భూముల్లో పెంచి వాటిని కూడా వదిలి వాటిని కూడా సంరక్షించాలి లేకపోతే ఇలాగే ఇవి తీవ్రమైన తర్వాత వీటి దాడుల్లో ప్రాణాలు కూడా వదులుకోవాల్సి వస్తుంది. దీనిపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెట్టి సమస్యను పరిష్కారం చేయాలి.
దీనికి సంబంధించిన అధికారులు తక్షణమే చర్య తీసుకోవాలి,లేదంటే గ్రామంలో రైతులకు ప్రజలకు తీవ్ర నష్టం ఏర్పడుతుంది.

# దాసరి పల్లె రహదారిలో శ్రమదానం

**కమాన్‌పూర్, అక్టోబర్ 7 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ జన్మదినాన్ని పురస్కరించుకుని మంగళవారం బీజేపీ సేవా పక్వాడ్ కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. కమాన్‌పూర్-జూలపల్లి మధ్య వెంకటేశ్వర థియేటర్ నుంచి దాసరి పల్లె వరకు ఉన్న రహదారిలో పిచ్చిమొక్కలను తొలగించారు. బీజేపీ మండల అధ్యక్షుడు కొయ్యడ సతీష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు మచ్చగిరి రాము, సీనియర్ నాయకులు మట్ట శంకర్, జంగపల్లి అజయ్, మల్లారపు అరుణ్ కుమార్, పెద్దపల్లి శ్యాంసుందర్, బర్ల సదానందం, గట్టు శ్రీనివాస్, ఆసం శ్రీనివాస్, కాసు పవన్ తదితరులు పాల్గొన్నారు.



# ఎయిర్ కండిషనర్ పితామహుని వర్ధంతి సందర్భంగా నివాళులు



**కరీంనగర్, అక్టోబర్ 7 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
ఎయిర్ కండిషనర్ సృష్టిదాత విల్లిస్ క్యారియర్ వర్ధంతిని పురస్కరించుకుని మంగళవారం కరీంనగర్ జిల్లా ఏసీ టెక్నీషియన్ యూనియన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో ఘనంగా నివాళులర్పించారు.క్యారియర్ సేవలను స్మరించుకుంటూ ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, సీనియర్ టెక్నీషియన్లను సన్మానించారు. కరీంనగర్ జిల్లా హాస్పిటల్‌లో పేషెంట్స్, బంధువులకు అరటి పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమానికి సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు గిట్ల ముకుందరెడ్డి, కార్యదర్శి ఎడ్ల రమేష్, టీఎన్జీఓ జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్ రెడ్డి, రిటైర్డ్ ఆర్టీఓ పి. ప్రతాప్ రావు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. "విల్లిస్ క్యారియర్ 1902లో తొలి ఆధునిక ఎయిర్ కండిషనర్ రూపొందించారు. ఆయన ఆవిష్కరణ వల్ల ఆధునిక జీవనశైలి మారింది" అని ఎడ్ల రమేష్ పేర్కొన్నారు. ఏసీ టెక్నీషియన్లు అసంఘటిత కార్మికులుగా ఉన్నందున, వీరిని భవన నిర్మాణ కార్మికుల వెల్ఫేర్ బోర్డులో నమోదు చేసి సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో సలీముద్దీన్, మహమ్మద్ రఫీక్, హైమద్, ఎండి ఖలీల్, గొల్లపల్లి సత్యనారాయణ, తిరుపతి, ఎండి ఖాన్, అయూబ్ ఖాన్, ఎండి తాజ్ బాబా, షకీల్, షేక్ అవిద్ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల విధులు సమర్థవంతంగా నిర్వహించాలి

**- కలెక్టర్ పమేలా సత్పతి**




**కరీంనగర్, అక్టోబర్ 7 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో భాగంగా నోడల్ అధికారులకు కేటాయించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడేతో కలిసి నోడల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి, మ్యాన్‌పవర్, బ్యాలెట్ బాక్సులు, రవాణా, శిక్షణ, ఖర్చుల పరిశీలన, మీడియా కమ్యూనికేషన్, ఫిర్యాదుల పరిష్కారం, ఓటర్ స్లిప్పుల పంపిణీ, ఫలితాల పర్యవేక్షణ తదితర అంశాలపై సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఎన్నికల విధుల్లో పారదర్శకత, నిష్పక్షపాతత పాటించాలని, ప్రభుత్వ ఉద్యోగులు ఎన్నికల ప్రచారాల్లో పాల్గొనరాదని హెచ్చరించారు.బ్యాలెట్ బాక్సుల కొరత లేదని, శిక్షణ పూర్తయిందని తెలిపారు. కార్యక్రమంలో డిఆర్ఓ వెంకటేశ్వర్లు, జిల్లా పరిషత్ సీఈవో శ్రీనివాస్, పంచాయతీ అధికారి జగదీశ్వర్, నోడల్ అధికారులు పాల్గొన్నారు.

# కొమురం భీమ్‌కు ఘన నివాళి

**అనారోగ్య బాధితురాలికి 2.50 లక్షల ఎల్ఓసీ**



**మంథని, అక్టోబర్ 7 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
కొమురం భీమ్ వర్ధంతి సందర్భంగా మంథని మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నివాళులర్పించారు. మంత్రివర్యులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి శ్రీను బాబు ఆదేశాల మేరకు, నాయకులు అయిలి ప్రసాద్, ఎరుకల ప్రవీణ్, అజీమ్ ఖాన్, మందపు మధు, అయిలి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. "నిజాం పాలనకు వ్యతిరేకంగా ఆదివాసుల హక్కుల కోసం కొమురం భీమ్ పోరాడారు. ఆయన జీవితం స్ఫూర్తిదాయకం" అని నాయకులు పేర్కొన్నారు. అదే సందర్భంగా, మంథని మండలం ధర్మారం (గద్దలపల్లి) గ్రామానికి చెందిన అనారోగ్య బాధితురాలు తొంబురపు సుష్మకు 2,50,000 ఎల్ఓసీ మంజూరు చేశారు.
మంత్రి శ్రీధర్ బాబు సీఎంఆర్ఎఫ్ ద్వారా ఈ సహాయం అందజేశారు. హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆసుపత్రి సహాయకుల ద్వారా ఎల్ఓసీ అందజేయడం జరిగింది. కుటుంబ సభ్యులు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

# కరీంనగర్ సీపీ కార్యాలయంలో వాల్మీకి జయంతి వేడుకలు




**కరీంనగర్, అక్టోబర్ 7 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
మహర్షి వాల్మీకి జయంతిని పురస్కరించుకుని కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో మంగళవారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. అడిషనల్ డీసీపీ వెంకటరమణ ముఖ్య అతిథిగా పాల్గొని వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. "వాల్మీకి కేవలం కవి కాదు, యుగ పురుషుడు. ఆయన రచించిన రామాయణం మానవ విలువలకు అద్దం పడుతుంది" అని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ కిరణ్ కుమార్, కమిషనరేట్ అధికారులు, సూపరింటెండెంట్లు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# ధర్మ పీఠం పై దాడి హేయమైన చర్య,బరితెగించిన మతోన్మాదిని శిక్షించాలి

**-లౌకిక, ప్రజాస్వామిక,రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడాలి**
**-పాలడుగు నాగార్జున కెవిపిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు**

**నల్లగొండ ,అక్టోబర్ 7 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టులో భారత ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) బి ఆర్ గవాయ్ పైనే ఓ మతోన్మాది షూ విసిరే ప్రయత్నం చేయడం హేయమైన చర్య అని కెవిపిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పాలడుగు నాగార్జున అన్నారు. బరితెగించిన మతోన్మాది రాకేష్ కుమార్ పై చట్టపరమైన చర్యలు తీసుకొని వెంటనే అరెస్టు చేసి దేశ ప్రజలకు ఆర్ఎస్ఎస్ సంఘ్ పరివార్ శక్తులు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక నల్లగొండ పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద కెవిపిఎస్ మరియు ప్రజాసంఘాల అధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టడం జరిగింది ఈ సందర్భంగా పాలడగు నాగార్జున, మాట్లాడుతూ సోమవారం ఉదయం కేసు విచారణ సమయంలో డయాస్ వద్దకు వెళ్లిన న్యాయవాది రాకేష్ కిషోర్ ఒక్కసారిగా తన స్పోర్ట్స్ షూ తీసి, సిజెఐ పైకి విసిరే ప్రయత్నం చేయడం రాజ్యాంగ వ్యవస్థకు అవమానకరమన్నారు. భారత చరిత్రలో ఇది చీకటి రోజు అని అన్నారు.సనాతనం పేరుతో జరిగే దాడులను భారత సమాజం సహించదు అన్నారు.

**సమగ్రమైన దర్యాప్తు చేపట్టాలి**
**ప్రముఖ న్యాయవాది దర్శనం నరసింహా**

ప్రముఖ అడ్వకేట్ దర్శనం నరసింహ మాట్లాడుతూ ప్రధాన న్యాయమూర్తి పైన దాడి మాత్రమే కాదు, రాజ్యాంగంపై జరిగిన దాడి అన్నారు. సమిష్టిగా భారత సమాజం గవాయ్ కు సంఘీభావంగా,అండగా నిలవాలని కోరారు. ఈ బుద్ధిహీనమైన చర్య ఈ సమాజాన్ని ద్వేషం, మతోన్మాదం ఎలా ముంచెత్తాయో చూపిస్తుందని విమర్శించారు. ఈ చర్య దురదృష్టకరమని, ఖండించదగినదని, ఈ ఘటనను న్యాయవ్యవస్థపై దాడిగా పేర్కొన్నారు. ఈ ఘటన సాధారణంగా జరిగింది కాదని,స్వతంత్ర న్యాయవ్యవస్థపై జరిగిన బహిరంగ దాడిగానే




పేర్కొన్నారు. దీనిని వికృత మనస్తత్వం కలిగిన వ్యక్తి చేసిన చర్యగా పరిగణించలేమని, సంఘ్ పరివార్ శక్తులు దేశంలో న్యాయ వ్యవస్థ, దాని స్వతంత్రత పై,న్యాయ సమీక్ష శక్తి పై లౌకికవాద భావనపై దుర్మార్గపు దుర్భాషలతో ప్రచారంలో భాగంగా దీనిని చూడాలని అన్నారు.దీనిని సహించలేమని, సమాజంలోని అన్ని వర్గాలు, ముఖ్యంగా న్యాయ సోదరభావం కలిగినవారు తీవ్రంగా ఖండించాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ ఘటనను క్షుణ్ణంగా దర్యాప్తు చేయాలని, నిందితుడి వెనుక ఉన్న వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

**రాజ్యాంగ ధర్మమే అంతిమమైనది.**
**పందుల సైదులు తెలంగాణ విద్యావంతుల వేదిక అధ్యక్షులు**

తెలంగాణ విద్యావంతుల వేదిక జిల్లా అధ్యక్షులు పందుల సైదులు సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఇందూరి సాగర్ మాట్లాడుతూ దేశ అత్యున్నత న్యాయ వ్యవస్థపై దాడి జరిగి 24 గంటలు అవుతున్నా ప్రధాన మంత్రి,రాష్ట్రపతి,ఉపరాష్ట్రపతి నోరు మెదపకపోవడం రాజ్యాంగం పట్ల రాజ్యాంగ వ్యవస్థల పట్ల ఏ పాటి గౌరవం ఉందో ఈ దేశ ప్రజలు అర్థం చేసుకోవాలన్నారు.సనాతన ధర్మం అంటే దాడులు చేయడమా అన్నారు.వందేండ్ల ఆర్ఎస్ఎస్ సంఘపరివారశక్తులు నేర్పుతున్నది ఇదేనా అన్నారు.వందేళ్ల ఆర్ఎస్ఎస్ కార్యచరణ వ్యవస్థ పై దాడి చేయడానికి సిద్ధమయిందా! అన్నారు.
ధర్మ పీఠం పై దురాక్రమణ దాడి జాతి విచ్చిన్నానికి నిదర్శనం అన్నారు.సనాతన ధర్మం పేరుతో మను ధర్మాన్ని ప్రతిష్ఠంచదలుచుకొని ఈ దాడులకు తెగబడుతున్నారన్నారు.అంబేద్కర్ వ్రాసిన రాజ్యంగ ధర్మం కంటే ఈ భారత దేశంలో మరేధర్మం గొప్పది కాదన్నారు. రాజ్యాంగ వ్యవస్థను ఉంచదల్చుకోలేకనే ఇలాంటి ఘటనలకు పాల్పడుతున్నారు.
షెడ్యూల్ క్యాస్ట్ కు చెందిన మేధావి ఆ వ్యవస్థ మీద కూర్చోవడం బిజెపి జీర్ణించుకోలేకపోతుందని తెలిపారు భారతదేశాన్న ఆదునికరించింది.రాజ్యాంగ ధర్మం అన్నసంగతి యాది మరువొద్దు అన్నారు.లౌకిక, ప్రజాస్వామిక,రాజ్యాంగ ధర్మాన్ని కాపాడుకోవాలన్నారు.
రాజ్యాంగ వ్యవస్థల పట్ల విలువలు ఉన్నవాల్లు ఒక దగ్గరకు రావాలన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు చినపాక లక్ష్మీనారాయణ,మాలమహానాడు జిల్లా అధ్యక్షులు గోలి సైదులు, ఐద్వా మహిళా సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కొండ అనురాధ, గీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కొండ వెంకన్న, కెవిపిఎస్ పట్టణ కార్యదర్శి గాదె నరసింహ, బొల్లు రవీందర్ కుమార్, మాల మహానాడు జాతీయ నాయకులు రేఖల సైదులు తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ యోగ పోటీల్లో పథకాలు సాధించాలి: కన్న కృష్ణ



**కరీంనగర్, అక్టోబర్ 7 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
ఈనెల 9 నుంచి 12 వరకు మైసూర్‌లో జరిగే 50వ సీనియర్స్ జాతీయ స్థాయి యోగాసన పోటీల్లో కరీంనగర్ జిల్లా క్రీడాకారులు పథకాలు సాధించాలని జిల్లా యోగా అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కన్న కృష్ణ ఆకాంక్షించారు. స్థానిక తారక హోటల్‌లో రాష్ట్ర జట్టుకు ఎంపికైన క్రీడాకారులతో సమావేశమై, "జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచి పతకాలు సాధించాలి" అని ఆయన పేర్కొన్నారు. పురుషుల విభాగంలో పి. స్వరూప చారి, ఎల్. కోటేశ్వరరావుబీ మహిళల విభాగంలో జే. ఆమని, పి. సుగుణ, బి. ప్రవళికలను సన్మానించారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి నాగిరెడ్డి సిద్ధారెడ్డి, కోచ్‌లు వి. కిష్టయ్య, జి. రామకృష్ణ, పి. మల్లేశ్వరి పాల్గొని అభినందనలు తెలిపారు.

# అమ్మవారికి పల్లకి, ఉయ్యాల సేవలు

**సహస్ర దీపారాధన ఘనంగా**



**కరీంనగర్, అక్టోబర్ 7 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
కోజాగరి పౌర్ణమి సందర్భంగా మంగళవారం నగునూర్‌లోని పరివార సమేత దుర్గాభవానీ దేవాలయంలో పల్లకి సేవ, ఉయ్యాల సేవ, సహస్ర దీపారాధన, విశేష హారతులతో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు పవనకృష్ణ శర్మ ఆధ్వర్యంలో పూజలు కనుల పండువగా సాగాయి. ఈ కార్యక్రమంలో ఆలయ ఫౌండర్ వంగల లక్ష్మన్, కమిటీ బాధ్యులు వేములవాడ ద్రోణచారి, నీరుమల్ల తిరుపతి, భక్తులు పాల్గొన్నారు.

# కాంట్రాక్టు కార్మికులకు బోనస్ జమ చేయాలి

**సీఐటీయూ డిమాండ్**

**రామగుండం, అక్టోబర్ 7 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
సింగరేణి ఎంప్లాయిస్‌కి సెప్టెంబర్ 29న లాభాల బోనస్ జమ చేసినప్పటికీ, ఆర్జీ-3 ఏరియాలో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికుల ఖాతాల్లో ఇప్పటివరకు బోనస్ జమ కాలేదని సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘం ఆరోపించింది. కాంట్రాక్టర్ల అకౌంట్లలో బోనస్ జమ చేయకపోవడం, 10% కోత



విధించాలని కొందరు కోరడం వల్ల అధికారులు కాలయాపన చేస్తున్నారని సీఐటీయూ ఎస్‌సీకేఎస్ బ్రాంచ్ కార్యదర్శి చిప్పకుర్తి అరవింద్ తెలిపారు. తక్షణమే కాంట్రాక్టర్ల ఖాతాల్లో బోనస్ జమ చేసి, అన్ని విభాగాల కాంట్రాక్టు కార్మికుల ఖాతాల్లోకి బోనస్ చేరేలా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రతి విషయంలో వివక్ష చూపుతున్న సింగరేణి యాజమాన్యం తక్షణమే మొండి వైఖరిని విడనాడాలని కోరారు.

# పోలంపల్లికి ఎస్సీ రిజర్వేషన్ కలగలేదని ఆవేదన



**తిమ్మాపూర్, అక్టోబర్ 7 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
గ్రామ పంచాయతీ వ్యవస్థ అమలులోకి వచ్చినప్పటి నుండి తిమ్మాపూర్ మండలంలోని పోలంపల్లి గ్రామానికి ఎప్పటికీ ఎస్సీ రిజర్వేషన్ కలగలేదని సీపీఐ మండల కార్యదర్శి బోయిని తిరుపతి ఆవేదన వ్యక్తం చేశారు. "అంబేద్కర్ రాజ్యాంగంలో పొందుపరిచిన హక్కులు, అవకాశాలు పోలంపల్లి దళితులకు అందడం లేదు. గత ప్రభుత్వాలు, అధికారులు రిజర్వేషన్ ప్రక్రియలో గ్రామ స్థాయి నాయకుల ఒత్తిళ్లకు లోనై దళితులకు అన్యాయం చేశాయి" అని ఆయన పేర్కొన్నారు. ఇప్పటి రిజర్వేషన్‌లో కూడా ఇప్పటికే ఎస్సీ రిజర్వ్ అయిన గ్రామాలకు మళ్లీ ఎంపీటీసీ, సర్పంచ్ పదవులు రావడం, పోలంపల్లికి మాత్రం అవకాశం రాకపోవడం అనుమానాలకు తావిస్తోంది. 2011 జనాభా లెక్కల ప్రకారం గ్రామ ఓటర్ల సంఖ్య 2,529 కాగా, అందులో ఎస్సీ జనాభా 290 మంది ఉన్నారు. పక్క జిల్లాల్లో ఒక్క ఎస్సీ కుటుంబం ఉన్నా రిజర్వేషన్ కలుగుతుండగా, పోలంపల్లికి మాత్రం న్యాయం జరగడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మానకొండూరు నియోజకవర్గంలో దళిత ఎమ్మెల్యే ఉన్నందున, ఈ విషయాన్ని పరిగణలోకి తీసుకొని పోలంపల్లి దళితులకు న్యాయం చేయాలని కోరారు.

# రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలకు పారమిత విద్యార్థుల ఎంపిక



**కరీంనగర్, అక్టోబర్ 7 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
పారమిత ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి బాక్సింగ్ చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికయ్యారు. ఇటీవల అంబేద్కర్ స్టేడియంలో నిర్వహించిన జిల్లా ఎస్.జి.ఎఫ్ అండర్–17 బాక్సింగ్ పోటీల్లో 8వ తరగతి విద్యార్థిని ఎమ్. తనుశ్రీ (54–57 కిలోల), పదవ తరగతి విద్యార్థులు పి. సిమ్రిత రెడ్డి, జి. సాకేత్ రెడ్డి (75–80 కిలోల) బంగారు పతకాలు సాధించారు. అక్టోబర్ 10–12 తేదీలలో హన్మకొండ జె.ఎన్ స్టేడియంలో జరిగే 69వ రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీల్లో పాల్గొననున్నారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ డా. ఇనుగంటి ప్రసాదరావు, డైరెక్టర్లు ప్రసూన, రాకేష్, రశ్మిత, అనుకర్ రావు, వినోదరావు, వి.యు.ఎం. ప్రసాద్, హనుమంతరావు, ప్రధానోపాధ్యాయులు ప్రశాంత్, బాలాజీ, కవిత ప్రసాద్, సమన్వయకర్త శ్రీనాథ్, బాక్సింగ్ కోచ్ ఎ. రామకృష్ణను అభినందించారు.

# అల్ఫోర్స్ స్కూల్‌లో వాల్మీకి జయంతి



**కరీంనగర్, అక్టోబర్ 7 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ–టెక్నో స్కూల్‌లో మంగళవారం మహర్షి వాల్మీకి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యాసంస్థల అధినేత డా. వీ. నరేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని వాల్మీకి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. 'వాల్మీకి బ్రహ్మ అవతారంగా రామాయణం ద్వారా మానవ ధర్మాన్ని విశదీకరించారు" అని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రమాదకర విద్యుత్ స్తంభాలను సరి చేసిన కాంట్రాక్టర్



**రామగుండం, అక్టోబర్ 7 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
ఒకటవ డివిజన్ సిక్కువాడలో ఎమ్మెల్యే ఆదేశాల మేరకు నెలరోజుల క్రితం ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలు వర్షాల వల్ల ఒరిగిపోయి ప్రమాదకరంగా మారాయి. ఈ విషయాన్ని కాంట్రాక్టర్ దృష్టికి తీసుకెళ్లడంతో మంగళవారం వచ్చి స్తంభాలను సరిచేశారు. కాంట్రాక్టర్‌కు డివిజన్ ప్రజల తరపున మడిపల్లి మల్లేశం (కాంగ్రెస్) ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# తెలుసుకోవడం పౌర హక్కు – సమాచారం శక్తి!

## ప్రజాస్వామ్యానికి దీపస్తంభం - ఆర్టీఐ చట్టం

"తెలుసుకోవడం పాపం కాదు, తెలియకపోవడమే ప్రమాదం" ౦ ఈ మాట ప్రజాస్వామ్యంలో ఎంతో అర్థవంతం. ప్రభుత్వం చేసే ప్రతి నిర్ణయం, ప్రతి రూపాయి ఖర్చు, ప్రతి ఫైల్ చలనం ౦ ఇవన్నీ చివరికి ప్రజలే తెలుసుకోవాలి. ఈ అవగాహనకే చట్టబద్ధత ఇచ్చింది సమాచార హక్కు చట్టం - Right to Information Act, 2005.

### ప్రజాస్వామ్యానికి ప్రాణం – పారదర్శకత

ప్రజాస్వామ్యం అంటే కేవలం ఓటు వేయడం కాదు, పాలనలో భాగస్వామ్యం కావడం. ఆ భాగస్వామ్యానికి మొదటి మెట్టు సమాచారం. ప్రభుత్వ యంత్రాంగం ఎలా పనిచేస్తుందో, నిర్ణయాలు ఎలా తీసుకుంటుందో తెలుసుకోవడం పౌరుని హక్కు. ఈ ఆలోచనతోనే 2005లో ఆర్టీఐ చట్టం వెలువడింది.

### ఏం చెబుతుంది ఆర్టీఐ చట్టం

ప్రభుత్వ విభాగాలు, స్థానిక సంస్థలు, పబ్లిక్ ఫండ్స్ ఉపయోగించే సంస్థలు ౦ ఇవన్నీ ప్రజలకు సమాధానం చెప్పాల్సిందే. ఏ పౌరుడైనా సంబంధిత శాఖకు సమాచారం కోరుతూ రాతపూర్వకంగా లేదా ఆన్‌లైన్‌లో దరఖాస్తు ఇవ్వొచ్చు.
30 రోజుల్లో సమాధానం ఇవ్వాల్సి ఉంటుంది. ప్రాణ, స్వేచ్ఛకు సంబంధించిన విషయం అయితే 48 గంటల్లోనే సమాధానం తప్పనిసరి.

### సమాచారం రాకపోతే?

సమాధానం ఇవ్వకపోతే లేదా తప్పుడు సమాచారం అందించినా ౦ పౌరుడికి రెండు స్థాయిల్లో అప్పీల్ చేసే అవకాశం ఉంది. సరైన సమాధానం ఇవ్వనందుకు బాధ్యుడైన అధికారిపై రూ.25,000 వరకు జరిమానా విధించవచ్చు. ఈ చర్యలు ప్రజలకు బలం, అధికారులకు జాగ్రత్తను కలిగిస్తాయి.

### కమిషన్లు – ప్రజల భరోసా

కేంద్రం, రాష్ట్ర స్థాయిల్లో సమాచార కమిషన్లు ఏర్పాటయ్యాయి. వీటిలో ప్రధాన సమాచార కమిషనర్‌తో పాటు పది వరకు కమిషనర్లు ఉంటారు. ప్రజలు ఇచ్చిన ఫిర్యాదులను ఇవి విచారించి, అధికారులను జవాబుదారులుగా నిలబెడతాయి.

### మినహాయింపులు కూడా ఉన్నాయి

దేశ భద్రత, న్యాయవ్యవహారాలు, వాణిజ్య రహస్యాలు, వ్యక్తిగత గోప్యత వంటి విషయాలపై సమాచారం ఇవ్వడం తప్పనిసరి కాదు. కానీ ప్రజాప్రయోజనం అధికంగా ఉంటే, ఆ రహస్యాలనూ వెల్లడి చేయవచ్చు.

### ప్రజలే పహరాదారులు

సమాచార హక్కు చట్టం ఒక సాధారణ చట్టం కాదు –ఇది ప్రజాస్వామ్యాన్ని కాపాడే రక్షకవలయం. ఒకప్పుడు "తెలుసుకోవాలంటే సంబంధాలు ఉండాలి" అన్న మాట ఉండేది. ఇప్పుడు "తెలుసుకోవడం హక్కు" అయింది. ప్రభుత్వ వ్యవస్థలో పారదర్శకతకు, అవినీతి నిరోధానికి ఈ చట్టం మార్గదర్శకం అయింది.

### సమాచారం అంటే శక్తి

తెలుసుకున్నవాడు విజేత. తెలుసుకోవడానికి భయపడినవాడు బానిస. ప్రజాస్వామ్య సమాజంలో ఆర్టీఐ చట్టం ప్రతి పౌరుడికి వెలుగుదీపం. ప్రజలు ఈ హక్కును ఉపయోగించి సమాధానం అడిగే సంస్కృతి పెంపొందిస్తే, దేశ పరిపాలన మరింత ప్రజాకేంద్రీకృతంగా మారుతుంది.



**సమాచార హక్కు చట్టం రక్షణ సమితి వ్యవస్థాపక &రాష్ట్ర అధ్యక్షులు**
**కొర్ర. కిషన్ నాయక్**
**ఫోన్ నెం 9885122005**

# మహిళా ఆటో డ్రైవర్లు ఆదర్శంగా నిలవాలి: కలెక్టర్





**కరీంనగర్, అక్టోబర్ 7 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
మహిళా ఆటో డ్రైవర్లు ఆర్థిక సాధికారత సాధించి తోటి మహిళలకు ఆదర్శంగా నిలవాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. దుర్గాబాయి దేశ్ముఖ్ మహిళా శిశు వికాస కేంద్రం ద్వారా శిక్షణ పొందిన మహిళలతో మంగళవారం కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు. "ఉచిత శిక్షణతో పాటు ఆటోలు కూడా అందజేశాం. మహిళలే స్వయంగా నడిపిస్తూ ఉపాధి పొందాలి" అని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో మహిళా ప్రాంగణం మేనేజర్ సుధారాణి పాల్గొన్నారు.

# గురుకుల పాఠశాలలో విద్యార్థి అనుమానాస్పద మృతి




**హుస్నాబాద్, అక్టోబర్ 7 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
జిల్లెలగడ్డ శివారులోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 8వ తరగతి విద్యార్థి సనాదుల వివేక్ (13) అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన కలకలం రేపింది. నంగునూరు గ్రామానికి చెందిన వివేక్, నిన్న హాస్టల్లో చేరగా, ఈరోజు ఉదయం గదిలో మృతిగా కనిపించాడు. స్కూల్ సిబ్బంది సమాచారం మేరకు హుస్నాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. తల్లిదండ్రులు, బంధువులు కన్నీటి పర్యంతమవుతుండగా, స్థానికులు ఘటనపై పూర్తి స్థాయి దర్యాప్తు జరిపి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

# సీజేఐపై దాడి రాజ్యాంగంపై దాడి




**కరీంనగర్, అక్టోబర్ 7 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయ్‌పై దాడిని తీవ్రంగా ఖండిస్తూ మంగళవారం కెవిపిఎస్, ఎస్ఎఫ్ఐ నాయకులు కళ్లకు నల్ల గుడ్డలు కట్టుకొని తెలంగాణ చౌక్ వద్ద నిరసన తెలిపారు. "ఇది వ్యక్తిగత దాడి కాదు, రాజ్యాంగంపై దాడి. న్యాయవ్యవస్థ స్వతంత్రతను దెబ్బతీసే కుట్రల భాగం" అని కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి తిప్పారపు సురేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గజ్జెల శ్రీకాంత్ అన్నారు. భీమ్ ఆర్మీ తెలంగాణ చీఫ్ వాసాల శ్రీనివాస్ మాట్లాడుతూ "దాడి వెనుక బీజేపీ–ఆర్ఎస్ఎస్ కుట్రలు ఉన్నాయని" ఆరోపించారు. నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని, సంఘీభావంగా దేశం నిలవాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ, కెవిపిఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


# బంధువుల నుండి చట్టబద్ధ దత్తత



**కరీంనగర్, అక్టోబర్ 7 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
మానకొండూర్ మండలం చెంజర్లకు చెందిన పిల్లలు లేని దంపతులు రక్తసంబంధీకుల నుండి చట్టబద్ధంగా దత్తత తీసుకున్నారు.
జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో దత్తత ఉత్తర్వులు అందజేశారు. 'దత్తత ప్రక్రియ చట్టబద్ధంగా జరగాలి. బంధువుల నుండి దత్తత తీసుకోవాలంటే జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయాన్ని సంప్రదించాలి" అని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, శిశుగృహ మేనేజర్ తేజస్విని, ఎల్‌సిపిఒ రాజు పాల్గొన్నారు.

# అరుదైన ఖనిజాలను అమెరికాకు ఎగుమతి చేసిన పాకిస్థాన్


**ఇస్లామాబాద్ :అక్టోబర్ 7 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
ఆర్థిక, వ్యూహాత్మక భాగస్వామ్యంలో అగ్రరాజ్యం అమెరికా, పాకిస్థాన్ మధ్య కొత్త బంధం ఏర్పడింది. అరుదైన ఖనిజాల ఎగుమతి అంశంలో రెండు దేశాలు తమ అగ్రిమెంట్‌ను అమలు చేస్తున్నాయి. అమెరికాకు చెందిన స్ట్రాటజిక్ మెటల్స్ శాఖ, పాక్ ప్రభుత్వం మధ్య సెప్టెంబర్‌లో ఒప్పందం కుదిరింది. దాని ప్రకారం అరుదైన ఖనిజాలకు చెందిన తొలి షిప్మెంట్ అమెరికాకు బయలుదేరినట్లు తెలుస్తోంది. అమెరికా కంపెనీ సుమారు 500 మిలియన్ల డాలర్ల పెట్టుబడితో పాకిస్థాన్‌లో మినరల్ ప్రాసెసింగ్, డెవలప్మెంట్ కేంద్రాన్ని ఏర్పాటు చేసే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. ప్రపంచవ్యాప్తంగా ఖనిజాల సరఫరా



దేశాల్లో పాకిస్థాన్ కీలక పాత్ర పోషించినున్నట్లు ఈ నేపథ్యంలో అమెరికా ప్రకటన చేసింది. పాకిస్థాన్ షిప్మెంట్ చేసిన ఖనిజాల్లో యాంటిమోనీ, కాపర్ కాన్‌సెంట్రేట్, రేర్ ఎర్త్ మెటల్స్ నియోడైమియం, ప్రసియోడైమియం ఉన్నాయి. అమెరికా, పాకిస్థాన్ వ్యూహాత్మక భాగస్వామ్యంలో ఇది కీలక మైలురాయిగా నిలుస్తుందని యూఎస్ఎస్ఎం వెల్లడించింది. పాకిస్థాన్‌లో మినరల్ రిఫైనరీల ఏర్పాటు మార్గం ఈజీ అవుతుందని పేర్కొన్నది. అరుదైన ఖనిజాల ఎగుమతి వల్ల పాకిస్థాన్‌కు బిలియన్లలో ఆదాయం వస్తుందని ఆశిస్తున్నారు. ఉద్యోగ అవకాశాలు ఉంటాయని కొందరంటున్నారు. ఆ దేశంలో సుమారు ఆరు ట్రిలియన్ల డాలర్ల విలువైన ఖనిజ నిక్షేపాలు ఉన్నట్లు అంచనా వేస్తున్నారు. అరుదైన ఖనిజాల విషయంలో అమెరికాతో కుదుర్చుకున్న ఒప్పందాన్ని ప్రతిపక్ష పీటీఐ పార్టీ తప్పుపట్టింది. అమెరికాతో జరుపుకున్న సీక్రెట్ ఒప్పందాలను బహిర్గతం చేయాలని ఆ పార్టీ ప్రతినిధి షేక్ అక్రమ్ డిమాండ్ చేశారు.

## చోరీకి గురైన 40 వేల ఫోన్లు చైనాకు స్మగ్లింగ్

**లండన్ అక్టోబర్ 7 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
ఫోన్ దొంగతనాలకు పాల్పడుతున్న ఓ గ్యాంగ్ గుట్టును బ్రిటన్ పోలీసులు విప్పారు. బ్రిటన్ నుంచి దొంగలించిన సుమారు 40 వేల ఫోన్లను చైనాకు స్మగ్లింగ్ చేసినట్లు ఆ గ్యాంగ్‌పై ఆరోపణలు ఉన్నాయి. దొంగతనానికి గురైన ఓ ఐఫోన్ కేసును చేధిస్తున్న పోలీసులకు ఆ గ్యాంగ్ విషయాలు బయటపడ్డాయి. గత ఏడాది ఓ అంతర్జాతీయ ఫోన్ దొంగల ముఠా సుమారు 40 వేల మొబైల్ ఫోన్లను స్మగ్లింగ్ చేసినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ కేసులో 18 మందిని అరెస్టు చేశారు. చోరీకి గురైన సుమారు రెండు వేల ఫోన్లను రికవరీ చేశారు. లండన్‌లో ఫోన్ చోరీ



ఘటనలు ఎక్కువగా నమోదు అవుతున్నాయి. అంతర్జాతీయ టూరిస్టులతో కిటకిటలాడే లండన్‌లో ఫోన్ చోరీ కేసులు అధికం అవుతున్నాయి. ఫోన్ దొంగల ముఠాను పట్టుకునే క్రమంలో లండన్‌లోని సుమారు 28 ప్రాపర్టీల్లో పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఓ ఐఫోన్ చోరీ కేసులో దర్యాప్తు చేపడుతున్న సమయంలో ఆ ఫోన్ లింకు హీత్రూ ఎయిర్‌పోర్టుకు వెళ్లింది. అక్కడ తనిఖీ చేసిన అధికారులకు ఆ ఫోన్ ఓ బాక్సులో ఉన్నట్లు గుర్తించారు. అయితే ఆ బాక్సులో సుమారు 900 ఫోన్లు ఉన్నాయని, అవన్నీ కూడా చోరీకి గురైనవే అని పోలీసులు నిర్ధారించారు. ఆ కేసుతో కూపీలాగిన పోలీసులకు అంతర్జాతీయ ఫోన్ దొంగతనాల ముఠా గుట్టు వీడింది. గత నాలుగేళ్ల నుంచి బ్రిటన్‌లో ఫోన్ దొంగతనాల సంఖ్య భారీగా పెరిగింది. 2020లో 28 వేల ఫోన్లు చోరీగా కాగా, ఆ సంఖ్య 2024లో 80 వేలు దాటింది.

## లంచం తీసుకుంటుండగా పట్టుబడ్డ డ్రగ్ ఇన్స్పెక్టర్



**కరీంనగర్, అక్టోబర్ 7 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
నగరంలోని డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ కార్యాలయంలో 20 వేల రూపాయలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు దాడి నిర్వహించారు. ఎడిసి శ్రీనివాస్, డ్రగ్ ఇన్స్పెక్టర్ కార్తీక్ రెడ్డి, ప్రైవేట్ వ్యక్తి రామును రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నట్లు అధికారులు తెలిపారు.

## రామేశ్వరంలో పౌర్ణమి అన్నప్రసాద వితరణ

**ఫరూక్‌నగర్, అక్టోబర్ 7 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
శ్రీ రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో ప్రతినెల నిర్వహించే అన్న వితరణలో భాగంగా పౌర్ణమి సందర్భంగా మంగళవారం భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని రంగారెడ్డి జిల్లా ఆర్యవైశ్య



మహాసభ అధ్యక్షుడు గందె సురేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. సామాజిక కార్యకర్త నీల రవీందర్, హన్మారి మురళి, ఆగిరి విష్ణు, గడ్డం ఆంజనేయులు, వీరేష్, అశోక్, పోల బాలరాజ్, గజవాడ యశ్వంత్ రాజ్, సాయి, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

## ట్రేడ్ లైసెన్సులపై మున్సిపల్ తనిఖీలు


**కరీంనగర్, అక్టోబర్ 7 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
కరీంనగర్ మార్కెట్ గంజి పరిసరాల్లో మున్సిపల్ అధికారులు మంగళవారం ట్రేడ్ లైసెన్సులపై తనిఖీలు నిర్వహించారు. రెన్యువల్ కాలం ముగిసిన షాపులకు



జరిమానాలు విధించారు. తనిఖీ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, షాపు యజమానులు పాల్గొన్నారు.

## మల్లోజుల లేఖకు మద్దతిస్తాం!

**సాయుధ పోరాటాన్ని త్యజించాలనే నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం**
**సంచలనం రేపుతున్న మాడ్ ఏరియా కమిటీ కార్యదర్శి సనిత లేఖ**




**కొత్తగూడెం ప్రగతి మైదాన్, :అక్టోబర్ 07 (నేటి భారత్)**
మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు మల్లోజుల వేణుగోపాల్ అలియాస్ సోను విడుదల చేసిన లేఖపై కొంతకాలంగా ఆ పార్టీలో భిన్న స్వరాలు వినిపిస్తున్నాయి. ఆ పార్టీ ప్రస్తుత మాడ్ డివిజన్ ఏరియా కమిటీ కార్యదర్శి సనిత పేరుతో మంగళవారం విడుదలైన లేఖ సంచలనం రేకెత్తిస్తోంది. తాజాగా శాంతి చర్చలపై మల్లోజుల 22 పేజీల లేఖ విడుదల చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయన లేఖకు మద్దతుగా ఆ పార్టీ మాడ్ డివిజన్ కమిటీ నిలిచింది. సాయుధ పోరాటాన్ని త్యజించాలనే నిర్ణయానికి తమ కమిటీ మద్దతిస్తున్నట్లు సనిత పేర్కొన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో తాము తీసుకుంటున్న ఈ నిర్ణయాన్ని అర్థం చేసుకుని ప్రజలు మద్దతుగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. తమ డివిజన్ కమిటీ తీసుకున్న నిర్ణయాన్ని పార్టీకి, కార్యకర్తలకు వివరించాలని పేర్కొన్నారు. ఇకపై మాడ్ ఏరియాలో ఎలాంటి చట్ట విరుద్ధ కార్యకలాపాలకు పాల్పడకుండా బాధ్యత వహిస్తామని తెలిపారు.

## ప్రభుత్వాధినేతగా 25 ఏళ్ల సేవ..

**అనుభూతులు పంచుకున్న ప్రధాని మోదీ**

**న్యూఢిల్లీ :అక్టోబర్ 7 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
ప్రధాని నరేంద్ర మోదీ తన రాజకీయ జీవితంలో కీలక మైలురాయి అందుకున్నారు. ప్రభుత్వాధినేతగా ఆయన 25 ఏళ్లు పూర్తి చేసుకున్నారు.




ఓ ప్రభుత్వానికి అధినేత హోదాలో ఆయన 25 ఏళ్లుగా సేవలు అందిస్తున్నారు. అక్టోబర్ 7, 2025 నాటికి తన పరిపాలన 25 ఏళ్లకు చేరుకున్నట్లు ప్రధాని మోదీ తన ఎక్స్ అకౌంట్‌లో పేర్కొన్నారు. ఇదే రోజున 2001లో గుజరాత్ సీఎంగా బాధ్యతలు చేపట్టినట్లు తెలిపారు. దేశ ప్రజల జీవితాలను బలోపేతం చేసేందుకు, దేశ ఉజ్వల ప్రగతి కోసం ఆ నాటి నుంచి శ్రమిస్తున్నట్లు చెప్పారు. చాలా విపత్కర పరిస్థితుల్లో ఉన్న గుజరాత్‌కు తనను సీఎంగా చేశారని, ఆ బాధ్యతలను తనకు పార్టీ అప్పగించినట్లు గుర్తు చేశారు. భారీ భూకంపం, సూపర్ సైక్లోన్, వరుస కరవులతో సతమతం అవుతున్న గుజరాత్‌ను తన చేతుల్లో పెట్టారన్నారు. ఇక 2014 లోక్‌సభ ఎన్నికల తర్వాత ప్రధానిగా దేశానికి సేవ చేస్తున్నట్లు మోదీ తన ఎక్స్ అకౌంట్‌లో తెలిపారు. తన ట్వీట్స్‌లో వివిధ అనుభవాలను గుర్తు చేశారు.

## కమిషనర్‌కు శ్రీనివాసుల ఆహ్వానం



**కరీంనగర్, అక్టోబర్ 7 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
శ్రీనివాస మిత్రుల ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా అక్టోబర్ 26న తలసేమియా బాధిత పిల్లల కోసం మెగా రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు శ్రీనివాసుల సేవా సంస్థ ప్రకటించింది. ఈ కార్యక్రమానికి అతిథిగా హాజరుకావాలని కోరుతూ మంగళవారం నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫూల్ దేశాయ్‌ను సంస్థ సభ్యులు కలిసి సన్మానించి ఆహ్వానం అందజేశారు. ఈ కార్యక్రమంలో వూట్కూరి శ్రీనివాస్ రెడ్డి, గట్టు శ్రీనివాస్, పైడ శ్రీనివాస్, ఇజ్జగిరి శ్రీనివాస్, చొక్కారపు శ్రీనివాస్, పెద్ది శ్రీనివాస్, జిల్లా శ్రీనివాస్, ఉప్పుగండ్ల శ్రీనివాస్, గోనె శ్రీనివాస్ పాల్గొన్నారు.

## బతుకమ్మ చీరలను పరిశీలించిన మంత్రి సీతక్క




**సిరిసిల్ల, అక్టోబర్ 7 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
రాజన్న సిరిసిల్లలో తయారైన బతుకమ్మ చీరలను మంగళవారం రాష్ట్ర మంత్రి ధనాసరి అనసూయ (సీతక్క) పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్ రెడ్డి పాల్గొన్నారు.

## నేడు మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి పర్యటన

**యాచారం అక్టోబర్ 08 ( నీలగిరి ఎక్స్ ప్రెస్) :**
యాచారం మండల కేంద్రంలో" బీఆర్ఎస్ పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు మంచిరెడ్డి కిషన్ రెడ్డి "కాంగ్రెస్ బాకీ కార్డు"లను మార్నింగ్ వాక్ ద్వారా బుధవారం ఉదయం 8:00" గంటలకు " ప్రజలకు పంపిణీ చేయనున్నారు అని టిఆర్ఎస్ పార్టీ యాచారం మండలం అధ్యక్షులు కర్నాటి రమేష్ గౌడ్ , ప్రధాన కార్యదర్శి పశ్చా భాష తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి



కూడా పాల్గొంటారనీ తెలిపారు. కావున, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు అందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## ట్రాఫిక్ పై విద్యార్థులకు అవగాహన





**కడ్తాల్, అక్టోబర్ 7 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ )**
భావి భారత పౌరులైన విద్యార్థులకు ట్రాఫిక్ పై మంగళవారం అవగాహన కల్పించడంతోపాటు వారిని ట్రాఫిక్ విధులలో భాగస్వామ్యం చేయాలనే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కడ్తాల్ పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో ఏసిపి ట్రాఫిక్ శంషాబాద్ పి.నాగభూషణం షాద్ నగర్ ట్రాఫిక్ సిఐ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ట్రాఫిక్ పై అవగాహన కల్పించారు. ట్రాఫిక్ నియమాలైన ఎడమ చేతి వైపు నడవడం హెల్మెట్ ధరించాలని తల్లిదండ్రులను ప్రోత్సహించటం త్రాగి వాహనాలు నడపొద్దని తల్లిదండ్రులకు చెప్పాలని మైనర్లు వాహనాలు నడుపుద్దని తదితర అంశాలపై అవగాహన కల్పించి తదంతరం వారిని కడ్తాల్ జంక్షన్లో విద్యార్థులకు ట్రాఫిక్ విధులపై అవగాహన కల్పిస్తూ వారితో సిగ్నల్స్ ప్రాక్టీస్ చేపించి ట్రాఫిక్ ని ఎలా ఆపాలి తర్వాత జీబ్రా క్రాసింగ్ మీద పాదాచార్యులు వెళ్తున్నప్పుడు వాహనాలు నిల్పటం అదేవిధంగా విహెచ్ఎఫ్ సెట్ వాడకం వేగంగా ప్రయాణిస్తున్న వాహనాలను పై ట్యాబ్ ద్వారా ఫోటో తీసి చలాన్ జనరేట్ చేయటం లాంటి విషయాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.